ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేశిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక
సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం
Your Ad Here.
ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి
EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం / తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

THURSDAY 13TH AUGST 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 148 COST : 3\- KHAMMAM, TELANGANA


గురువారం 13 ఆగస్టు 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక :148 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు



న్యూఢిల్లీ,ఆగస్ట్12 గత రెండు రోజుల నుంచి బంగారం ధరలు పెరుగుతూ పోతున్నాయి. వరుసగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. శ్రావణమాసం కావడంతో ధరలు పెరగడంపై మహిళలు పెదవి విరుస్తున్నారు. బుధవారం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 1,040 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 950 రూపాయలు..18 క్యారెట్ల బంగారంపై 770 రూపాయలు పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్ సైట్ ప్రకారం.. ఉదయం 11 గంటల ప్రాంతంలో హైదరా బాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,54,860 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,41,950 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,16,140 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.




## మాజీ రాష్ట్రపతి కోవింద్ బయోగ్రఫీ

### ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ ఆవిష్కరించిన మోడీ

న్యూఢిల్లీ,ఆగస్ట్12 భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బయోగ్రఫీని ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తకాన్ని బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కోవింద్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. రాష్ట్రపతిగా కోవింద్ అందించిన మార్గదర్శకత్వం, తనపై చూపిన ఆప్యాయత, ఆత్మీయత తనకు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక దిశలో రామ్‌నాథ్ గొప్ప మిగతా 2వ పేజిలో..

# తెలంగాణ పేదలకు ఇళ్ల సౌకర్యం పెంచండి

- ఇళ్ల కేటాయింపులో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వండి
- కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌కు పొంగులేటి వినతి



న్యూఢిల్లీ,ఆగస్ట్12 ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ కింద తెలంగాణ రాష్ట్రానికి సమగ్ర ప్రాతిపదికన ఒకేసారి 11,56,915 ఇళ్లను కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను పొంగులేటి కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో ముఖ్యమంత్రి . రేవంత్‌రెడ్డి రాసిన లేఖను ఈ సందర్భంగా పొంగులేటి గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇళ్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్ 2024' యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు. వీటికి సంబంధించి సూపర్ చెక్, అనర్హుల

మిగతా 2వ పేజిలో..



## నీటివాటాలపై రాజీపడే ప్రసక్తి లేదు

- వాటాల్లో బిఆర్ఎస్ వల్లే తెలంగాణకు నష్టం
- అసత్యాలను ప్రచారం చేయడం అలవాటు చేసుకున్న కెటిఆర్
- మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్,ఆగస్ట్12 తెలంగాణ నీటి వాటా విషయంలో ఎక్కడా రాజీపడబోమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. నీటి వాటాల్లో తెలంగాణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నష్టం చేసిందని విమర్శించారు. బుధవారం గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరవుతామని తెలిపారు. నీటీ వాటాపై బలంగా కొట్లాడుతామని పేర్కొన్నారు. అసత్యాలతో ప్రజలను మిగతా 2వ పేజిలో..



## టాటా సన్స్ చైర్మన్ పదవికి చంద్రశేఖరన్ రాజీనామా

- ఆరు నెలల ముందే తప్పకున్న చంద్రశేఖరన్

న్యూఢిల్లీ,ఆగస్ట్12 టాటా సన్స్ చైర్మన్ పదవికి ఎన్ చంద్రశేఖరన్ రాజీనామా చేశారు. ఈ సంస్థ చైర్మన్ పదవిని తాను మరోసారి కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. ఆగస్టు 18వ తేదీన ఆ సంస్థ సర్వసభ్య సమావేశం మిగతా 2వ పేజిలో..

## సిఎం రేవంత్‌తో లెఫ్టినెంట్ జనరల్ సి.రాజేష్ పుష్కర్ భేటీ

- ఆర్మీరిక్రూట్‌మెంట్‌లో యువతకు ప్రోత్సాహం ఇవ్వాలని వినతి
- అవసరమైన శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడి

మిగతా 2వ పేజిలో..


## మాజీ జడ్జి యశ్వంత్ వర్మ దోషిగా తేల్చిన కమిటీ

- పార్లమెంటరీ కమిటీ ప్యానల్ విచారణలో సంచలన విషయాలు వెల్లడి

న్యూఢిల్లీ,ఆగస్ట్12 ఇంట్లో భారీగా నోట్ల కట్టలు లభించిన కేసులో ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి యశ్వంత్ వర్మ దోషిగా తేలారు. అతడిపై మోపిన అభియోగాలు అన్నీ నిజమేనని లోక్‌సభ ప్యానెల్ నిర్ధరించింది. అయితే, ఈ విషయంలో అతడిపై ఏ చర్యలు తీసుకుంటారనే విషయంలో ఇంకా స్పష్టత లేదు. ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి, రిటైర్డ్ జస్టిస్ యశ్వంత్ వర్మ ఢిల్లీలోని 30 తుగ్లక్ రోడ్డులోని ప్రభుత్వ భవనాల్లో నివాసం ఉంటున్నాడు. గత ఏడాది మార్చి 14-15 తేదీల మధ్య అతడి ఇంట్లో మిగతా 2వ పేజిలో..

## చర్చకు తానెప్పుడూ సిద్ధమే

- చర్చ లేకుండా చేస్తున్నదే విపక్షం
- హోంమంత్రి అమిత్ షా స్పష్టీకరణ



న్యూఢిల్లీ,ఆగస్ట్12 పార్లమెంట్‌లో చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తానన్నారు. పార్లమెంటు కార్యకలాపాలకు పదేపదే అడ్డంకులు ఏర్పడుతున్న నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ప్రతిష్టంభనకు తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అన్ని అంశాలపై చర్చించేందుకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. అయితే సభలో చర్చ జరగాలా? ఆందోళన కొనసాగాలా? అనేది ప్రతిపక్షమే నిర్ణయించుకోవాలన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలనుంచి గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు.. 24 గంటల

మిగతా 2వ పేజిలో..

# డిఫాల్టర్ మిల్లర్ల నుంచి బకాయిల వసూళ్లు

- మిలర్ల బ్లాక్‌మెయిల్‌ను ఎట్టి పరిస్థితిలో సహించం
- డిఫాలర్ల మిల్లులను మహిళలకు అప్పగించాలి
- పౌరసరఫరాల శాఖ సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం



హైదరాబాద్,ఆగస్ట్12 :సివిల్ సప్లయిస్ శాఖలో డిఫాల్ట్ అయిన రైస్‌మిల్లర్ల నుంచి బకాయిలను వసూల్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఉద్దేశ పూర్వకంగా డిఫాల్ట్ అయి బకాయిలు చెల్లించని రైస్ మిల్లులను స్వాధీనం చేసుకొని మహిళా సంఘాలకు అప్పగించే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. బకాయిల వసూళ్లకు ఒక విధానాన్ని రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. కేబినెట్ సబ్‌కమిటీలో దీనిపైన చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. బకాయిల వసూళ్లే ప్రధాన లక్ష్యంగా చర్యలు ఉండాలని మార్గనిర్దేశంచేశారు. మిల్లర్ల బ్లాక్ మెయిల్‌ను సహించనని హెచ్చరించారు. బుధవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో సివిల్ సప్లయిస్ శాఖపై ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ స్టీఫెన్ రవీంద్ర, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. మార్కెట్‌లో ఉన్న గోదాములను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశిరచారు. అవసరమైతే మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని స్పష్టం చేశారు. ఐదు నియోజకవర్గాల్లో మహిళా సంఘాలకు 50 నుంచి 100 ఎకరాల్లో గోదాంల నిర్మాణం కోసం పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం ఎక్కువ దిగుబడి అయ్యే ప్రాంతాలను పైలట్

మిగతా 2వ పేజిలో..

## రేవంత్ సోదరుల భూకుంభకోణం నిజం

- మేం టి హబ్‌ను తెస్తే..వారు అనుముల హబ్స్‌తో దోపిడీ
- మరోమారు ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్,ఆగస్ట్12 ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు భూకుంభకోణాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

మిగతా 2వ పేజిలో..

## మాజీరాష్ట్రపతి కోవింద్ బయోగ్రఫీ

కృషి చేశారని, ఆయన చేసిన సూచనలు దేశాన్ని కొత్త దిశలో నడిపించనున్నాయని తెలిపారు. 'నాకు కోవింద్ చాలా కాలంగా తెలుసు. ఆయన సామర్థ్యాలను నేను సుదీర్ఘకాలంగా తెలుసుకునే అవకాశం లభించింది. ఈ ఆత్మకథ భారత ప్రజాస్వామ్యం, సమా జానికి చిరస్మరణీయ వారసత్వంగా నిలుస్తుంది. రాష్ట్రపతి పదవిలో ఉన్న సమయంలో కోవింద్ ఇచ్చిన సూచనలు, చూపిన ప్రత్యేకమైన ఆప్యాయత నాకు ఎంతో విలువైన ఆస్తిగా నిలిచాయి. ఆయన జీవిత అనుభవాలు, ఎదుర్కొన్న సవాళ్ల నుంచి దేశ యువత ఎంతో నేర్చుకోవచ్చు. ఆయన ఆలోచనలు, అనుభవాలను కొత్త తరం తెలుసుకోవాలి. పుస్తకానికి ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ అనే పేరు పెట్టడం ఎంతో సముచితం. కోవింద్ జీవితంలో ఎదురైన పోరాటాలు వ్యక్తిగతమైనవే కానీ. వాటి ఫలితంగా సాధించిన విజయం మాత్రం భారత గణతంత్రానికి, దేశ ప్రజాస్వామ్యానికే చెందుతుందన్న సందేశం ఈ శీర్షికలో ఉంది' అని ప్రధాని మోదీ అన్నారు.

# మాజీ జడ్జి యశ్వంత్ వర్మ దోషిగా తేల్చిన కమిటీ

అగ్నిప్రమాదం జరిగింది. దీంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలను ఆర్పేశారు. ఈ ఘటనకు సంబంధించి అప్పట్లో కొన్ని ఫొటోలు బయటపడ్డాయి. సంచలన విషయాలు వెలుగు చూశాయి. అగ్నిప్రమాదం జరిగిన యశ్వంత్ వర్మ ఇంట్లో భారీగా నోట్ల కట్టలున్నాయి. ఇంటి స్టోర్ రూమ్‌లో ఈ నోట్ల కట్టలు చాలా వరకు కాలిపోయాయి. కొన్ని ధ్వంసమయ్యాయి. అవన్నీ రూ.500 నోట్ల కట్టలే. ఈ అంశం వివాదాస్పదం కావడంతో పోలీసులు, ఇతర అధికారులు ఆ ఇంటికి వెళ్లి ఆ ప్రదేశాన్ని సీజ్ చేశారు. అప్పటికే ఇంట్లోని సాక్షాలు తారుమారు అయ్యాయి. ఫొటోల్లో కనిపించిన కరెన్సీ నోట్లు ఆ సమయానికి అక్కడ లేవు. మొదట ఈ నోట్ల కట్టలకు, తనకు సంబంధం లేదని యశ్వంత్ వర్మ చెప్పాడు. అసలు, ఈ నోట్లు తన ఇంటికి సంబంధం లేదని చెప్పాడు. అయితే, ఒక రిటైర్డ్ జడ్జి ఇంట్లో భారీగా నోట్ల కట్టలు కనిపించడం సంచలనంగా మారింది. జడ్జిల అవినీతి అంశం తెరమీదకు వచ్చింది. దీంతో ఈ అంశంపై పెద్ద దుమారం రేగింది. చివరకు దీనిపై పార్లమెంట్ స్పందించింది. ఈ అంశంపై విచారణ జరిపేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఒక ప్యానెల్ ఏర్పాటు చేశారు. ఈ ప్యానెల్.. ఈ అంశంపై విచారణ జరిపింది. ఈ విచారణ తర్వాత అతడిని ప్యానెల్ దోషిగా గుర్తించింది. ఇందుకు ప్రధాన కారణాలు ఇవి. ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది.. అది ఎవరిది.. ఆ డబ్బు ఎంత ఉంటుంది.. వంటి వివరాలపై యశ్వంత్ వర్మ సరైన సమాధానం చెప్పలేక పోయారు. ఆ డబ్బు ఎక్కడినుంచి వచ్చిందో తనకు తెలియదన్నాడు. ఇతరులు తన ఇంటిని అక్రమంగా వాడుకునే అవకాశం ఉందని, ఎవరో తనకు తెలియకుండా డబ్బు తన ఇంట్లో పెట్టారని వర్మ చెప్పాడు. తనపై కుట్ర చేసి ఎవరో ఆ నోట్లు తన ఇంట్లో పెట్టారని చెప్పాడు. అయితే, ఇందుకు తగ్గ సాక్షాల్ని ఆయన చూపించలేకపోయారు. ఆయన చెప్పిన సమాధానాలు నమ్మలేని విధంగా ఉన్నాయి. విచారణ ప్యానెల్ కూడా ఆ ఇంట్లోకి బయటి వ్యక్తులు వచ్చి, అంత డబ్బు ఉంచినట్లు ఆధారాలు లేవని తేల్చారు. మరోవైపు కాలిపోయిన నోట్లు తర్వాత కనిపించకపోవడంపై కూడా వర్మ సరైన సమాధానం చెప్పలేకపోయారు.ఈ అంశంలో యశ్వంత్ వర్మను లోక్‌సభ ప్యానెల్ దోషిగా తేల్చింది. వర్మ దోషిగా తేలిన నేపథ్యంలో అతడిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో అన్నది ఆసక్తిగా మారింది.

## తెలంగాణ పేదలకు ఇళ్ల సౌకర్యం పెంచండి

తొలగింపు పక్రియలన్నీ ఏడాది క్రితమే పూర్తయినప్పటికీ, కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకటనలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి తీవ్రమైన డిమాండ్ ఉందని తెలిపారు. ఒకేసారి ఈ ఇళ్లన్నింటినీ మంజూరు చేయాలని కోరారు. కేంద్ర వాటా, సాధారణ రాష్ట్ర వాటాతో సంబంధం లేకుండా ప్రతి పేద కుటుంబం ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ఇప్పటికే రాష్ట్ర బ్జడెట్‌లో కేటాయించినట్లు స్పష్టం చేశారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాలని పొంగులేటి సాదరంగా ఆహ్వానించారు. స్వయంగా రాష్ట్రానికి వచ్చి ఖఓంజ-ఉ 2.0 కింద ఇళ్ల కేటాయింపును ప్రకటిస్తే, తెలంగాణలోని గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని చెప్పుకొచ్చారు. అది చరిత్రాత్మక ఘట్టంగా మారుతుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాం రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ తదితరులు ఉన్నారు రాష్ట్రవ్యాప్తంగా

'ఆవాస్ ప్లస్?2024' యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు. వీటికి సంబంధించి సూపర్ చెక్, అనర్హుల తొలగింపు పక్రియలన్నీ ఏడాది క్రితమే పూర్తయినప్పటికీ, కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకటనలో జాప్యం జరుగుతోందన్నారు. తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి తీవ్రమైన డిమాండ్ పేరుకుపోయినందున, ఒకేసారి ఈ ఇళ్లన్నింటినీ మంజూరు చేయాలని కోరారు. ఇకపోతే కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాల్సిందిగా పొంగులేటి సాదరంగా ఆహ్వానించారు. స్వయంగా ఇళ్ల కేటాయింపును ప్రకటిస్తే, తెలంగాణలోని గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని, అది చారిత్రాత్మక ఘట్టంగా మారుతుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేష్ షెట్కార్, రామసహాయం రఘురాం రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ తదితరులు ఉన్నారు.

# డిఫాల్టర్ మిల్లర్ల నుంచి బకాయిల వసూళ్లు

ప్రాజెక్టు కింద ఎంపిక చేయాలని సూచించారు. గోదాంల నిర్మాణంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిధులను వినియోగించుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ప్రతి జిల్లాకు ఓ నోడల్ అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# టాటా సన్స్ ఛైర్మన్ పదవికి చంద్రశేఖరన్ రాజీనామా

జరగనుంది. అందుకు కొద్ది రోజుల ముందు చంద్రశేఖరన్ రాజీనామా చేయడం ప్రాముఖ్యత సంతరించుకుంది. టాటా గ్రూప్‌లో తాను 40 ఏళ్ల పాటు వృత్తి జీవితాన్ని పూర్తి చేసుకున్నానని తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక సంస్థకు సేవలందించడం ద్వారా సంతృప్తికరమైన అవకాశం లభించిందన్నారు. అందుకు కృతజ్ఞతలు తెలిపారు. గత దశాబ్ద కాలంగా టాటా సన్స్‌కు నాయకత్వం వహించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఇది అపారమైన బాధ్యత అని అభివర్ణించారు. వారసత్వంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఈ సందర్భంగా టాటా బోర్డుకు ఆయన విజ్ఞప్తి చేశారు. 2027, ఫిబ్రవరి 20వ తేదీ వరకు ఆయన పదవి కాలం ఉంది. కానీ కొన్ని నెలల మందే ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాతో టాటా సంస్థ షేర్లు దాదాపు 5 శాతం మేర పడిపోయాయి.గతంలో చంద్రశేఖరన్ టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటీవ్‌గా పని చేశారు. 2017లో టాటా సన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్ నియమితులయ్యారు. నాటి నుంచి ఆయన అదే పదవిలో కొనసాగుతున్నారు. అయితే ఈ సంస్థ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్‌ను మళ్లీ నియమించడంపై టాటా సన్స్, టాటా ట్రస్ట్ మధ్య వివాదం నెలకొన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన రాజీనామా చేశారని తెలుస్తోంది. టాటా గ్రూప్ సంస్థలో స్టీల్, మోటర్స్, టీసీఎస్, ఇండియన్ హోటల్స్ ఉన్నాయి. ఎన్ చంద్రశేఖరన్ ఇప్పటి వరకు వీటికి ఛైర్మన్‌గా వ్యవహరించారు.

# చర్చకు తానెప్పుడూ సిద్ధమే

పాటు ప్రతిపక్షాలు ప్రశ్నలు అడగడానికి అందుబాటులో ఉంటానని చెప్పారు. చర్చ జరపాలని ప్రతిపక్షాలు అధికారికంగా లేఖ రాస్తే.. చర్చ జరపడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. బుధవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో అమిత్ షా మీడియాతో మాట్లాడుతూ.. 'సమావేశాలు మొదలైన నాటినుంచి పార్లమెంట్‌కు వస్తున్నాను. నా ఛాంబర్‌లో కూర్చుంటున్నాను. పార్లమెంట్ కార్యక్రమాలు సజావుగా జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటుంటే.. ఎవరైనా ఏం చేస్తారు?. వాళ్లు చర్చ జరగడానికి అంగీకరించరు. దీన్ని బట్టి ఎవరు పారిపోతున్నారో ప్రజలే అర్థం చేసుకుంటారని అన్నారు. చర్చకు సిద్ధంగా ఉన్న ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయాలని సూచించారు. అలా చేస్తే మధ్యాహ్నం 3 గంటలకు చర్చ ప్రారంభించవచ్చని.. రాత్రి వరకు చర్చ కొనసాగించేందుకు తాను సిద్ధమన్నారు. అవసరమైతే గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా చర్చను కొనసాగిద్దామని తెలిపారు. ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకూ సమాధానం ఇస్తానని షా చెప్పారు. పార్లమెంటులో 'కనిపించడం లేదు', 'పారిపోయారు' వంటి పదాలు ఉపయోగించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జి ఘటనపై చర్చకు రావాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సవాల్ చేశారు.

అమిత్‌షా వ్యాఖ్యలకు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాపై ప్రశ్నల వర్షం కురిపించారు. 'విద్యార్థులపై లాఠీచార్జ్ ఎవరు చేశారు. కాల్పులకు ఆదేశించింది ఎవరు?. 20 రోజులుగా అమిత్‌షా ఎందుకు మాట్లాడలేదు. పార్లమెంట్ ముగిసే సమయానికి అమిత్‌షా డ్రామాలు ఆడుతున్నారు' అంటూ రాహుల్ మండిపడ్డారు.

# రేవంత్ సోదరుల భూకుంభకోణం నిజం

కేటీఆర్ ఆరోపణలు గుప్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాలని ఎద్దేవా చేశారు. నిజమైన స్టార్టప్‌లు ఎదగాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి దక్కాలని తాము కష్టపడి టి హబ్‌ను 'ను నిర్మిస్తే... సీఎం రేవంత్ రెడ్డి మాత్రం తన కుటుంబ ప్రయోజనాల కోసం 'అనుముల హబ్స్' ఏర్పాటు చేయడంలో బిజీగా ఉన్నారని విమర్శించారు. ఇది ఫ్యామిలీ-రన్.. ఫ్యామిలీ-డ్రైవ్.. జీరో ఇన్నోవేషన్.. జీరో ఎంఎ÷-లాయీస్ స్కామ్ అంటూ ఆరోపించారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు.. ఎటువంటి ప్రశ్నలు లేకుండా వందల కోట్లు విలువైన భూములు దక్కించుకోవచ్చంటూ సెటైర్ విసిరారు. 'సున్నా పెట్టుబడితో టెస్సరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్ అనే డిఫెన్స్ కంపెనీ పెట్టి, రాత్రికి రాత్రే కనీసం రూ.200 కోట్ల లాభం ఆర్జించినందుకు 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాల్సిందే. శ్రీధర్ బాబు, రేవంత్ రెడ్డి.. తెలంగాణలోని లక్షలాది మంది నిరుద్యోగ యువతకు కూడా ఈ అద్భుతమైన 'బిజినెస్ మోడల్' ఏంటో నేర్పించండి. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఇంత చౌకగా ఎలా పొందాలో శిక్షణ ఇవ్వండి. ఈ మ్యాజిక్ ట్రిక్ కేవలం అనుముల కుటుంబానికే ఎందుకు పరిమితం కావాలి? తెలంగాణ యువత మొత్తానికి ఈ 'అనుముల హబ్' అవకాశాన్ని కల్పించండి' అంటూ ఎక్స్‌లో కేటీఆర్ సెటైరికల్ కామెంట్స్ చేశారు.

# నీటివాటాలపై రాజీపడే ప్రసక్తి లేదు

పక్కదోవ పట్టిస్తున్నారంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై మండిపడ్డారు. కేసీఆర్ ఫాం హౌస్‌లో పండిన వరికి వచ్చిన ధర ఎంతో చెప్పాలంటూ కేటీఆర్‌ను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. తాము కోటిన్నర రూపాయిలకు ఇచ్చిన భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 90 లక్షలకే ఇచ్చిందని గుర్తు చేశారు. నిబంధనల మేరకే భూ కేటాయింపులు జరిగాయని ఆయన వివరించారు. 5 ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పారు. కేటీఆర్ చెబుతున్న రూ. 200 కోట్లు ఎక్కడివో చెప్పాలని నిలదీశారు. హిల్ట్ పాలసీ వల్ల హైదరాబాద్ ప్రజలకు మేలు జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పారిశ్రామిక వేత్తలను భయపెట్టడం కేటీఆర్‌కు మంచిది కాదని అన్నారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరైనది కాదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడికి హితవు పలికారు. రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరా భూమిని రూ.90 లక్షలకే కేటాయించారని, తమ ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎకరా కోటిన్నర లెక్కన కేటాయించినట్లు స్పష్టం చేశారు. ఐదు ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పిన శ్రీధర్‌బాబు.. కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్ల లెక్కలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టించొద్దని కేటీఆర్‌కు మంత్రి సూచించారు. హిల్ట్ పాలసీతో హైదరాబాద్ ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని.. పారిశ్రామికవేత్త లను భయపెట్టడం, తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు. నీటి వాటాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని మంత్రి స్పష్టం చేశారు. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరై తెలంగాణకు రావాల్సిన నీటి వాటాల కోసం బలంగా వాదిస్తామని శ్రీధర్‌బాబు వెల్లడించారు. తమపై ఉన్న కోపాన్ని తెలంగాణ ప్రజలపై చూపవద్దని ఆయనకు సూచించారు. బీఆర్ఎస్ గోబెల్స్ ప్రచారాన్ని ప్రజలు నమ్మలేద పేర్కొన్నారు. అందుకే ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించారని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

# సిఎం రేవంత్‌తో లెఫ్టినెంట్ జనరల్ సి.రాజేష్ పుష్కర్ భేటీ

- ఆర్మీరిక్రూట్‌మెంట్‌లో యువతకు ప్రోత్సాహం ఇవ్వాలని వినతి
- అవసరమైన శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడి

హైదరాబాద్,ఆగస్ట్12: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని భారత ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సి.రాజేష్ పుష్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా సీఎం తెలియజేశారు. ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి చూపుతున్న, అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. దీనిపై లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ సానుకూలంగా స్పందించారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్మెంట్‌లకు ముందు ఆయా తెలంగాణ జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. అలాగే, విపత్తు నిర్వహణలో ఆర్మీ పాత్రపైనా సీఎం చర్చించారు. రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస చర్యల్లో ఆర్మీ యంత్రాంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. తెలంగాణలో విపత్తు పరిస్థితుల్లో ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని స్థానిక ఆర్మీ అధికారులను ఆదేశిస్తామని లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ తెలిపారు. సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపడుతున్న మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ కొనియాడారు. హైదరాబాద్ నగరాన్ని రక్షించడానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి, చారిత్రక వైభవాన్ని తిరిగి తెచ్చేందుకు మూసీ నది పునరుజ్జీవనం అవసరమని పేర్కొన్నారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మేజర్ జనరల్ శ్రీనివాస్ రావు, ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

### అపరిచితుల ఫోన్లకు సమాధానం ఇవ్వరాదు

### సైబర్ క్రైమ్ ఏసీపీ ఫణీంద్ర హెచ్చరిక

ఖమ్మం,ఆగస్ట్12 సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మోసగాళ్ల మాటలు నమ్మి వ్యక్తిగత, బ్యాంకు వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సైబర్ క్రైమ్ ఏసీపీ ఫణీంద్ర సూచించారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పద్ధతిలో ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా బ్యాంకు అధికారులు, పోలీసు అధికారులు, టెలికాం సిబ్బంది పేరుతో ఫోన్ చేసి ఓటీపీ, ఏటీఎం పిన్, బ్యాంకు వివరాలు అడగడం, వాట్సాప్ లేదా ఇతర సామాజిక మాధ్యమాల్లో ఉద్యోగాలు, బహుమతులు, లోన్ల పేరుతో లింకులు పంపి డబ్బులు వసూలు చేయడం వంటివి జరుగుతున్నాయని అన్నారు. డిజిటల్ అరెస్టు పేరుతో భయపెట్టి నగదు బదిలీ చేయించడం వంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సైబర్ క్రైమ్ ఏసీపీ ఫణీంద్ర మాట్లాడుతూ.. ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకు ఖాతా నిలిచిపోతుందని లేదా పోలీసు కేసు నమోదైందని బెదిరించినప్పుడు భయపడకుండా సంబంధిత అధికారులను నేరుగా సంప్రదించాలని తెలిపారు. అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయకూడదని, ఓటీపీ లేదా పాస్‌వర్డ్‌లను ఎవరికీ చెప్పకూడదని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా సంబంధిత సైబర్ క్రైమ్ విభాగానికి సమాచారం అందించాలని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారా సైబర్ నేరాలను చాలా వరకు అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఈ సదస్సు ద్వారా సైబర్ నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి, ప్రజల సందేహాలను నివృత్తి చేశారు.

## రాజ్యసభలో 'లుంగీవాలా వ్యాఖ్యలు' కలకలం

బీజేపీ ఎంపీ సుష్మితా దేవ్ వ్యాఖ్యలపై ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆగ్రహం

న్యూఢిల్లీ,ఆగస్ట్12: రాజ్యసభలో 'లుంగీవాలా వ్యాఖ్యలు' కలకలానికి దారి తీశాయి. బీజేపీ ఎంపీ సుష్మితా దేవ్ తనను లుంగీవాలా అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని సీపీఐ (ఎమ్) ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆరోపించారు. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టారు. దక్షిణాది వ్యక్తిగా తన ఆహార్యం తనకు ఎంతో గర్వకారణమని ఎంపీ జాన్ బ్రిట్టాస్ తెలిపారు. పార్లమెంటు వేదికగా కించపరిచే వ్యాఖ్యలు చేయడం విచారకరమని అన్నారు. 'ఇటీవల ఓ రోజు నేను సభలో మాట్లాడుతుంటే ఆమె లుంగీవాలా అంటూ నన్ను ఉద్దేశించి అమర్యాదకర వ్యాఖ్యలు చేశారు.

# ముంబై ఘాట్‌కోపర్ ప్రాంతంలో విరిగిపడ్డ కొండచరియలు

### ఇద్దరు వ్యక్తులు మృతి...శిథిలా కింద చిక్కున్న పలువురు

ముంబై,ఆగస్ట్12 ముంబైలో భారీ వర్షాల వేళ ఘట్‌కోపర్-కుర్లా రహదారి సమీపంలోని అశోక్ నగర్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో ఆరుగురు మృతి చెందారు. పలువురు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున చిరాగ్ నగర్‌లోని గౌషియా చాల్ వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రాథోడ్ మెడికల్ సమీపంలో కొండచరియలు విరిగిపడటంతో అక్కడి ఇళ్లు శిథిలాల కింద చిక్కుకున్నాయి. ముంబై పోలీసులు, బీఎంసీ అధికారులు ఇప్పటివరకు ఆరుగురి మృతదేహాలను వెలికితీసి సమీప ఆసుపత్రికి తరలించారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉండొచ్చన్న అనుమానంతో సహాయక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ముంబై ÷ర్ బ్రిగేడ్, పోలీసులు, 108 అంబులెన్స్ సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్, బీఎంసీ వార్డు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాలను తొలగిస్తూ ప్రాణాలతో ఉన్నవారి కోసం గాలిస్తున్నారు. ఈ ఘటనలో ఇళ్లలో చిక్కుకున్న 18 ఏళ్ల సోహెల్ అన్సారీ, 14 ఏళ్ల మొహమ్మద్ అన్సారీలను రక్షించి సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఇద్దరికీ స్వల్ప గాయాలు కావడంతో చికిత్స అందిస్తున్నారు. ఇదిలా ఉండగా, వర్షాకాలానికి ముందే ఈ ప్రాంతంలోని పలు ఇళ్లకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. వర్షాల వల్ల కొండచరియలు విరిగిపడినట్లు డీసీపీ గణేశ్ షిండే చెప్పారు. ముంబై మేయర్ రీతూ తవడే, అదనపు మున్సిపల్ కమిషనర్ అవినాశ్ దాకనే.. ఘటనా స్థలాన్ని సందర్శించారు.

## పత్తి పంట సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన



మద్నూర్ / ఆగస్టు 12 ( అక్షరం న్యూస్ - కామారెడ్డి )

మద్నూర్ మండలం మెనూర్ గ్రామ వ్యవసాయా అధికారి విశాల్ గౌడ్ ( ఏ. ఈ. ఓ ) పత్తి పంట పై అవగాన కల్పించడం జరిగిందని తెలిపారు. బుధవారం రోజున మెనూర్ వ్యవసాయా సెక్టర్ లోని లక్ష్మ పూర్ గ్రామంలొ సాగు చేస్తున్న పత్తి పంట విధానం ను పర్శిలించారు. వ్యవసాయ గ్రామ అధికారి విశాల్ గౌడ్ పంట సాగు విధానం యొక్క ముఖ్య లక్షణాలను తెలిపారు. పత్తి రైతులకు సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులలో భాగంగా రసం పీల్చే పరుగుల నివారణ కొరకు పసుపు రంగు జిగురు అట్టలను ఒక ఎకరానికి 8-10 వాడితే రసం పీల్చే పురుగులు పసుపు రంగుకు ఆకర్షితం అయ్యి జిగురు అట్టలకి అత్తుకొని చనిపోతాయని రైతులకు అవగాన కల్పించడం జరిగింది. పంట పరశీలన లొ గ్రామ సర్పంచ్ శ్రీధర్, ఇమ్రాన్, అశోక్, గుణవంతు మరియు రైతులు పాల్గొనడం జరిగింది.

## వివాహ రిసిప్షన్ పత్రికలను అందించిన సర్పంచ్ అశోక్ పటేల్



మద్నూర్ / ఆగస్టు 12 ( అక్షరం న్యూస్ - కామారెడ్డి )

జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు కూతురు వివాహ రిసిప్షన్ కార్డులను సర్పంచ్ అశోక్ పటేల్ పంపిణి చేశారు. బుధవారం రోజున మెనూర్ గ్రామంలో ఉన్నటువంటి యూనియన్ బ్యాంకు, మోడల్ ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, యం. పి. యు. పి. యస్ పాఠశాల సిబ్బందికి మర్యాద పూర్వకంగా కలిసి వివాహ రిసిప్షన్ కార్డులను అందించి తప్పకుండ హాజరు కావాలని సర్పంచ్ కోరారు. ఎమ్మెల్యే కాంతారావు కూతురు వివాహ రిసిప్షన్ కందర్ పల్లి వద్దా ఉన్నటువంటి డి. బి. యల్. కేంద్రం వద్దా రిసిప్షన్ కార్య స్థలం కలదని తెలిపారు. తేది 16-08-2026 నాడు ఉదయం 10 గంటల నుండి రిసిప్షన్ విందు కలదని తెలిపారు. ఈ విందు కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి మండల సభ్యులు, రాష్ట్ర నాయకులు హాజరు కావడం జరుగుతుందని తెలిపారు. వివాహ రిసిప్షన్ కార్డులు అందుకున్న వారందరు విందు కార్యక్రమం లొ పాల్గొని నూతన వధువు, వరువులకు ఆశీర్వదించాలని కోరారు. సర్పంచ్ అశోక్ పటేల్ తో పాటు ఉప సర్పంచ్ మలుకు, నిసార్, సాయి బాబా కామట్ వార్, అవినాష్, అజయ్ టైలర్ పాల్గొన్నారు.

## పల్లెల్లో కార్పొరేట్ వైద్యం

- గూడెం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం



ఓదెల పెద్దపల్లి ఆగస్టు 12అక్షరం న్యూస్

పల్లెల్లో కార్పొరేట్ వైద్యం అందించడమే తమ లక్ష్యమని సర్పంచ్ చిట్ల రాము ముదిరాజ్ అన్నారు స్థానిక వివరాల్లోకి వెళ్తే ఓదెల మండలంలోని గూడెం గ్రామంలో ప్రముఖ కార్పొరేట్ హాస్పటల్ కరీంనగర్ సన్రైస్ హాస్పిటల్ వైద్యులు బుధవారం గూడెం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా అనేక మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు దాదాపు 300 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు సర్పంచ్ చిట్ల రామ్ ముదిరాజ్ పేర్కొన్నారు కార్పొరేట్ వైద్యం గ్రామ ప్రజలకు అందించడం మీ తమ లక్ష్యమని వర్షాకాలం అదృష్ట గ్రామాల్లో వైరల్ ఫీవర్ మరియు వ్యాధులు వ్యాపిస్తూ ఉండడంతో దాన్ని దృష్టిలో పెట్టుకొని కరీంనగర్ సన్రైజ్ హాస్పిటల్ వారితో ప్రత్యేకంగా సంప్రదించడంతో వాళ్లు వెంటనే స్పందించి గ్రామానికి వచ్చి ఉచిత వైద్య సేవలు అందించినందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు అన్నారు ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున ప్రజలు పాల్గొని వద్య పరీక్షలు చేయించుకున్నారు

## కాంగ్రెస్ ప్రభుత్వానికి నియోజకవర్గంలో
# వస్తున్న ఆదరణ ను చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపాలు

- నియోజకవర్గం పరువు తీస్తున్న పాడి కౌశిక్ రెడ్డి
- ఇప్పటికైనా పద్ధతి మార్చుకో లేకుంటే ప్రజలు తగిన గుణపాఠం చెప్తారు.
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేశిని కోటి



కరీంనగర్/ జమ్మికుంట/ ఆగస్టు 12 /అక్షరం న్యూస్:

హుజురాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబుకు కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణను చూసి జీర్ణించుకోలేక ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో రచ్చ చేశారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేశిని కోటి అన్నారు. బుధవారం జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని వినాయక గార్డెన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో దేశిని కోటి మాట్లాడుతూ కౌశిక్ రెడ్డి నియోజకవర్గ ప్రజలను బ్లాక్ మెయిల్ చేసి గెలిచి ప్రజల పరువు తీస్తున్నాడని అన్నారు. కమలాపూర్ మండలంలో నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందించేందుకు ప్రణవ్‌బాబు చొరవతో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సహకారంతో కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అయితే ప్రణవ్‌బాబుకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక కౌశిక్‌రెడ్డి కార్యక్రమంలో వివాదం సృష్టించారని ఆరోపించారు. మంత్రులు హుందాగా వ్యవహరించాలని సూచించినప్పటికీ ఆయన తన తీరు మార్చుకోలేదని విమర్శించారు. ప్రణవ్‌బాబుపై కౌశిక్‌రెడ్డి అనుచరులు ఇష్టారీతిన విమర్శలు చేయడం సరికాదని హెచ్చరించారు. దమ్ము, ధైర్యం ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలని, వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. కౌశిక్‌రెడ్డి లాంటి నాయకుడు నియోజకవర్గానికి అవసరం లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.రానున్న శాసనసభ ఎన్నికల్లో కౌశిక్‌రెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తే ఆయనకు 10వేల ఓట్లు కూడా దాటే పరిస్థితి లేదని, బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తే డిపాజిట్ కూడా దక్కదన్నారు. గతంలో ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో కార్యకర్తలు, నాయకులను పట్టించుకోని కౌశిక్‌రెడ్డిని నమ్ముకుని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇబ్బందులు పడవద్దని సూచించారు. బీసీ బిడ్డలు ఆలోచించాలి, బీసీ బంధు పథకం అమలుపైనా దేశిని కోటి స్పందిస్తూ. బీసీ బిడ్డలకు బీసీ బంధు అందిందా? అది ఎక్కడికి పోయిందో ఒక్కసారి ఆలోచించాలని కోరారు. కౌశిక్‌రెడ్డిని నమ్ముకుంటే భవిష్యత్తు దెబ్బతింటుందని, మంచి మనసుతో ప్రజలకు సేవ చేస్తున్న ప్రణవ్‌బాబును విమర్శించవద్దని బీసీ వర్గాలకు విజ్ఞప్తి చేశారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, హుజురాబాద్ నియోజకవర్గంలో వొడితల ప్రణవ్‌బాబు ఎమ్మెల్యేగా విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

# కారోబారికి తొలగించడం పై ఎంపీడీఓ కు వినతి పత్రం



మద్నూర్ / ఆగస్టు 12 ( అక్షరం న్యూస్ - కామారెడ్డి )

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం కోడిచిరా గ్రామ పంచాయతీ కారోబారి ( యం. పి. డబ్ల్యూ. యస్ ) పదవి నుండి ఎలాంటి కారణాలు లేకుండా తొలగించడం జకరిగిందని ఎంపీడీఓ కు వినతి పత్రం అందించడం జరిగింది. బుధవారం రోజున ఎంపీడీఓ కు ఒక వినతి పత్రం అందించి కారోబారి నాకు న్యాయం చేసి ఉపాధి కల్పించాలని కోరారు. వినతి పత్రంలో కొడ్చిరా గ్రామ కారోబారి అబ్దుల్ రజాక్ కొడ్చిరా గ్రామ పంచాయతికి 25 సంవత్సరాల నుండి కారోబారి గా సేవాలు అందించడం జరుగుతుందని తెలిపారు. కారోబార్లకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించి తమ యొక్క కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కొడ్చిరా గ్రామ సర్పంచ్ తేజశ్రీ మరియు 10 వార్డు సభ్యుల ద్వారా సమావేశం ఏర్పర్చి కారోబారిని తొలగించుదాం అని తెలుపగ 10 వార్డు సభ్యులలో 5 గురు సభ్యులు తిరస్కించి వెళ్లిపోవడం జరిగింది. సర్పంచ్ ఉన్నటువంటి 5 గురు వార్డు మెంబర్లతో కలిసి కారోబారిని తొలగించాలని తీర్మానం చేయడం ఎంత వరకు సబబు అని తెలిపారు. నీతి నిజాయితీతో నేనూ గ్రామానికి 25 సంవత్సరాలు ఎలాంటి మచ్చ లేకుండా కారోబారీగా గ్రామ ప్రజలకు సేవాలు అందించడం జరిగిందని తెలిపారు. గ్రామ సర్పంచ్ ను నేనూ చేసినటువంటి తప్పులు ఏమన్నా ఉంటే చెప్పండి అంటే కూడా తప్పులను చెప్పకుండానాపై కక్ష పూరీతంగా కారోబారి పదవి నుండి తొలగించడం జరిగిందని తెలిపారు. మండల ఇంచార్జ్ ఎంపీడీఓ గా ఉన్నటువంటి సత్యనారాయణ రెడ్డికి ఆయా గ్రామాల కారోబార్లు( యం. పి. డబ్ల్యూ. యస్ )లకు ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి పత్రం అందించడం జరిగింది. ఇట్టి విషయం పై నేనూ ఉన్నత అధికారులకు మరియు గ్రామ పంచాయతీ పాలక వర్గం సభ్యులకు ద్వారా విషయాన్ని కనుగొని న్యాయం చేస్తానని తెలిపారు. ఈ వినతి పత్రం భాగంలో ఆయా గ్రామాల కారోబార్లు అబ్దుల్ రజాక్, మరోతి, అంజాద్ హుస్సేన్, బి. సంజు, బి. పండరి, ఈరయ్యా, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రణవ్ హుజురాబాద్ నియోజకవర్గంలో చేస్తున్న
# అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపాలు

- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కొనసాగిస్తుంది కాబట్టే నియోజకవర్గం లో ఇంకా నువ్వు తిరగగలుగుతున్నావ్.
- లేదంటే ప్రజలు నిన్ను గ్రామాల్లో అడుగుపెడితే తరిమికొట్టేవారు.
- ఖబర్దార్ కౌశిక్ రెడ్డి.
- ఇల్లందకుంట దేవస్థానం చైర్మెన్ ఇంగిలే రామారావు



కరీంనగర్/ఇల్లందకుంట/ఆగస్టు 12/అక్షరం న్యూస్:

కమలాపూర్ లో డబుల్ బెడ్ రూమ్ ల కార్యక్రమానికి వచ్చిన కౌశిక్ రెడ్డి మాట్లాడిన తీరును దేవస్థానం చైర్మెన్ ఇంగిలే రామారావు ఖండించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ల పంపిణీ కార్యక్రమానికి రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హుజరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వోడితెల ప్రణవ్ కాంగ్రెస్ పార్టీ కి వస్తున్న ఆధారణను చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ పార్టీ పైన బురద జల్లు తున్నాడని ప్రతి మీటింగ్ లో అతని ద్వంద వైఖరి ప్రజలకు తలనొప్పిగా మారిందన్నారు. ప్రజాపాలన ప్రజా ప్రభుత్వం నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తుంటే ఓర్వలేని బిఆర్ఎస్ పార్టీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేగా కౌశిక్ రెడ్డి గెలిచి 3 సంవత్సరాలు కావస్తున్నప్పటికి ఎలాంటి అభివృద్ధి కి నోచుకోలేదు అని,మన నియోజకవర్గ ఇంచార్జి ప్రణవ్ అన్న హుజురాబాద్ ను అభివృద్ధి వైపు అడుగులేస్తుంటే కొంతమంది బిఆర్ఎస్ నాయకులు ప్రెస్ మీట్ లు పెట్టి ఇది ప్రజా ప్రభుత్వమా, నియంతృత్వమా అని అడుగుతున్నారు. ఇది ప్రజా ప్రభుత్వం కాబట్టే కౌశిక్ రెడ్డి స్వేచ్ఛగా నియోజకవర్గంలో గ్రామాల్లో తిరుగుతున్నారని లేదంట్ట ప్రజలు కౌశిక్ రెడ్డి ని తరిమికొట్టేవారని అన్నారు. ఇంకోసారి మా మంత్రుల పైన గాని మా నియోజకవర్గ ఇన్చార్జి పైన గాని మా కాంగ్రెస్ పార్టీ పైన గానీ అవాకులు చేవాకులు పేలితే కచ్చితంగా కౌశిక్ రెడ్డి పైన గతంలో కమలాపూర్ మండలంలో కోడిగుడ్ల దాడి జరిగినట్టుగానే దాడి చేస్తామని ఇల్లందకుంట మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన హెచ్చరిస్తున్నాం. ప్రతిపక్ష పార్టీలు సైతం మెచ్చుకోదగ్గ ప్రజా ప్రభుత్వం మాది అని కేంద్ర హోం సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ప్రెస్ మీట్ పెట్టి మరి గత ప్రభుత్వం మాకు ఏ రోజు కూడా అధికారికంగా కార్యక్రమాలకు పిలువలేదని కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రతి కార్యక్రమంలో మమ్మల్ని అధికారికంగా ఆహ్వానిస్తున్నారన్నారు. అలాంటి మా ప్రభుత్వం మీద బురదల్లే మీకు మీ బిఆర్ఎస్ పార్టీ నాయకులకు రానున్న ఎలక్షన్లలో హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలే తగిన గుణపాఠం,బుద్ధి చెబుతారన్నారు. నీ వైఖరి నచ్చకనే మీ బిఆర్ఎస్ పార్టీ నాయకులే కొంతమంది మీటింగ్లు పెట్టుకొని మరీ మాజీ మంత్రి హరీష్ రావు ని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని కలిసి మరీ మీ మీద ఫిర్యాదు చేయడం సిగ్గుచేటని అన్నారు. . అది మీ నాయకత్వ లక్షణం. కౌశిక్ రెడ్డి మీ పద్ధతి మార్చుకోండి హుజురాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించండి అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త గోలి కిరణ్,డీసీసీ కార్యదర్శి మ్యాకమల్ల అశోక్ యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గుండారపు సాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్



సూర్యాపేట/పెనపహాడ్ ఆగస్ట్ 12అక్షరం న్యూస్

పెనపహాడ్ మండలం నూర్జహాన్‌పేట్ గ్రామంలో భార్యపై అనుమానంతో ఆమెను హత్య చేసిన భర్త బాణోతు రవి (40)ని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.పోలీసుల వివరాల ప్రకారం.. భార్యపై అనుమానంతో తరచూ వేధింపులకు పాల్పడుతున్న రవి, ఈ నెల 10న రాత్రి ఆమెను ఇంటి సమీపంలో బలంగా నెట్టివేయడంతో కిందపడిన ఆమె తలకు గాయమైంది. అనంతరం ఆమెపై కాళ్లతో తొక్కి హత్య చేసినట్లు తెలిపారు.సూర్యాపేట ఎస్పీ ఆదేశాలతో డీఎస్పీ పర్యవేక్షణలో రూరల్ సీఐ రాజశేఖర్, పెన్‌పహాడ్ ఎస్ఐ, సిబ్బంది బుధవారం నిందితుడిని ఇంటి వద్ద అరెస్ట్ చేశారు.

# కమిషనరేట్ పరిధిలోని మొత్తం పోలీస్ వాహనాలను తనిఖీ చేసిన సీపీ





జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 12 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీస్ వాహనాల పనితీరు, నిర్వహణను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పెద్దపల్లి,మంచిర్యాల జోన్ల పరిధిలోని పోలీస్ స్టేషన్లకు చెందిన వాహనాలు నిరంతరం అందుబాటులో ఉండేలా,ప్రజలకు అందించే సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వాహనాల్లోని సమాచార ప్రసార పరికరాల పనితీరును పరిశీలించారు. అదేవిధంగా ప్రతి పోలీస్ వాహనంలో ప్రథమ చికిత్స పెట్టె, అత్యవసర దీపం, తాళ్లు,ట్రాఫిక్ కోన్లు, నేరస్థల రక్షణ రిబ్బన్లు, రక్షణ సామగ్రి కిట్‌లో భాగంగా హెల్మెట్, రాళ్ల దాడి నుంచి రక్షణ కవచం,లాఠీ, శరీర రక్షణ కవచం, ప్రతిఫలించే భద్రతా జాకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. వాహనాల నిర్వహణలో లోటుపాట్లను ఎప్పటికప్పుడు గుర్తించి సరిదిద్దాలని, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను ప్రతి నెలా సమర్పించాలని మోటారు వాహనాల అధికారులను ఆదేశించారు. పోలీస్ వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వాటిని ఎల్లప్పుడూ మంచి స్థితిలో ఉంచాలని వాహన డ్రైవర్లకు సూచించారు. పోలీస్ అధికారుల ఆధీనంలో ఉన్న వాహనాలను సొంత వాహనాల మాదిరిగా జాగ్రత్తగా నిర్వహించాలని, నిర్ణీత వ్యవధిలో వాహనాల మరమ్మతులు, ఇంజిన్ నూనె మార్పు, టైర్ల నిర్వహణ తదితర అంశాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. వాహనాల నిర్వహణపై డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి, వాహనాల పనితీరు, భద్రతా ప్రమాణాలపై వారికి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.



# పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి

- **ప్రతి కేసు దర్యాప్తు పురోగతిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి**
- **విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవు: సీపీ అంబర్ కిషోర్ ఝా**

జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 12 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించి, నాణ్యమైన దర్యాప్తు ద్వారా నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. విధుల్లో అలసత్వం,నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. సీసీటీఎన్ఎస్ 2.0 ద్వారా కమిషనరేట్ పరిధిలోని పెండింగ్ కేసులు,నిందితుల అరెస్టులు,దర్యాప్తు పురోగతి,నేర నియంత్రణ చర్యలను సమీక్షించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న, పాత కేసుల దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని,వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ 2.0లో ప్రతి కేసుకు సంబంధించిన ప్రతి అంశాన్ని స్టేషన్ హౌస్ ఆఫీసర్లు,దర్యాప్తు అధికారులు సకాలంలో నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. నిందితుల అరెస్టుల్లో ఎలాంటి జాప్యం చేయరాదని ఆదేశించారు. తీవ్రమైన నేరాలు, ఎన్‌డీపీఎస్ కేసులు, నేరాల పెరుగుదలకు సంబంధించిన కేసులు,కీలక నివేదికల పెండింగ్ అంశాలపై డీసీపీలు, ఏసీపీలు తమ పరిధిలోని కేసులను సీసీటీఎన్ఎస్ ద్వారా క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఈ-సమన్లను త్వరితగతిన పరిష్కరించి,వాటి పురోగతిపై నిరంతరం సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు.

ఆస్తి సంబంధిత కేసులు,చిట్‌ఫండ్, ఆర్థిక నేరాలు, సీఎంఆర్ బియ్యం అక్రమ మళ్లింపు కేసుల్లో ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, నిందితుల అరెస్టులు తదితర పెండింగ్ అంశాలను సమీక్షించారు. ఆర్థిక నేరాల్లో ఆస్తుల గుర్తింపు,స్వాధీనం, జప్తుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నందున ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆర్థిక నేరాల కేసుల్లో నిబంధనల ప్రకారం ఆస్తుల జప్తు ప్రక్రియను తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించారు. కొత్త నేర న్యాయ చట్టాలపై ప్రతి పోలీస్ అధికారి పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇతర రాష్ట్రాలు,జిల్లాల పోలీస్ అధికారులతో సమన్వయం కొనసాగిస్తూ కేసుల దర్యాప్తులో అవసరమైన సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, సమాచార సాంకేతికతకు సంబంధించిన కేసులను నిర్దేశిత ప్రామాణిక విధానాల ప్రకారం నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని ఆదేశించారు. జీఆర్ఎం,ఎంఆర్ఎం పనితీరును మెరుగుపరుచుకోవాలని,సమన్వయ పోర్టల్‌పై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. ప్రతి ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరై తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. గంజాయి,అక్రమ ఇసుక రవాణా, పేకాట,ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం అక్రమ తరలింపు తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది 24 గంటలూ, వారంలో ఏడు రోజులూ ప్రజలకు అందుబాటులో ఉండటం తమ ప్రాథమిక బాధ్యతగా గుర్తించాలని సీపీ తెలిపారు. సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు. నేరం జరిగిన వెంటనే సంఘటనా స్థలాన్ని సందర్శించి,ప్రజల ఫిర్యాదులను స్వీకరించి,వారికి పోలీసులపై నమ్మకం, భరోసా కలిగేలా వ్యవహరించాలని ఆదేశించారు. పోలీసుల ప్రవర్తనే పోలీస్ శాఖ ప్రతిష్ఠను నిర్ణయిస్తుందని సీపీ స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యానికి ఎలాంటి తావివ్వకూడదని తెలిపారు. అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్,పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి, అదనపు డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్,ట్రాఫిక్ ఏసీపీ సి. హెచ్.శ్రీనివాస్, సీసీఎస్ ఏసీపీలు రవీందర్, ప్రవీణ్ కుమార్,టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు, సైబర్ క్రైమ్ ఏసీపీ రంగారెడ్డి,ఏఆర్ ఏసీపీ ప్రతాప్‌తో పాటు ఇతర సీఐలు,ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



## పెద్దపల్లిలో పీఎం సేతు క్లస్టర్ ఐటీఐ ఏర్పాటు చేయాలి

- **కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రికి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ వినతి**



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 12 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

పెద్దపల్లి నియోజకవర్గంలో పీఎం సేతు క్లస్టర్ ఐటీఐ ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. పెద్దపల్లి ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధికి అనుగుణంగా స్థానిక యువతకు నాణ్యమైన సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణ అందించేందుకు క్లస్టర్ ఐటీఐ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు వివరించారు. పీఎం సేతు క్లస్టర్ ఐటీఐ ఏర్పాటు ద్వారా నియోజకవర్గంలోని విద్యార్థిని, విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన వివిధ నైపుణ్యాల్లో శిక్షణ పొందే అవకాశం లభిస్తుంది. శిక్షణ పూర్తిచేసిన యువతకు పరిశ్రమల్లో



ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు నిరుద్యోగ సమస్యను గణనీయంగా తగ్గించే అవకాశం ఉంటుంది. పెద్దపల్లి ప్రాంతంలో ఉన్న పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన స్థానిక యువత అందుబాటులోకి రావడం ద్వారా పరిశ్రమలకు, యువతకు పరస్పర ప్రయోజనం కలుగుతుందని వారు పేర్కొన్నారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా పారిశ్రామిక రంగాల్లో శిక్షణ అందించడం ద్వారా యువతకు మెరుగైన భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని తెలిపారు. పెద్దపల్లి ప్రాంతంలో పరిశ్రమలను తీసుకురావడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్న మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణకు పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల తరఫున పి. మల్లికార్జున్, శ్రమశక్తి అవార్డు గ్రహీత, అనుమాస శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పెద్దపల్లి నియోజకవర్గంలో పీఎం సేతు క్లస్టర్ ఐటీఐ ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## అవయవ శరీర దానాల అవగాహన కార్యక్రమం



ఓదెల పెద్దపల్లి ఆగస్ట్ 12అక్షరం న్యూస్

ఓదెల మండలంలోని ప్రభుత్వ కళాశాలలో బుధవారం విద్యార్థులకు మానవ అవయవ దానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు జాతీయ కార్యదర్శి భీష్మాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు ప్రపంచ అవయవ దాన దినోత్సవం ఆగస్టు 13 పురస్కరించుకొని ,సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి ఆధ్వర్యంలో, అవయవ శరీర నేత్ర దానాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ భీష్మాచారి మాట్లాడుతూ సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2008 సంవత్సరం నుండి ఇప్పటివరకు 1640 నేత్రదానాలు 160 దేహదానాలు 95 అవయవ దానాలు చేయడం జరిగిందని ఇందులో అత్యధికంగా ఓదెల మండలం నుండి 270పైన చేయడం, విశేషమని అన్నారు అందులో ఓదెల,అబ్బిడిపల్లి గ్రామస్తులు తమ మరణానంతరం నేత్రదానం చేస్తామని అప్పటి సర్పంచులు. ఓజ్జా కోమల శ్రీనివాస్. యాదవ్ ఆకుల మహేందర్ ఆధ్వర్యంలో తీర్మానాలు చేయడం రాష్ట్రంలో సంచలనంగా నిలిచిందని పేర్కొన్నారు

అవయవ శరీర దానాలు చేయడం మనకు మరో జన్మ

సర్పంచ్ సతీష్ కనిగిరి రెడ్డి

ఈ సందర్భంగా ఓదెల సర్పంచ్ సతీష్ కనిగిరి మాట్లాడుతూ అవయవ శరీర దానాలు చేయడం వలన మనకు మరో జన్మ ఉన్నట్టే అని అన్నారు మనిషి అవయవ శరీరాలు ఎంతో విలువైనయని వాటిని దానం చేయడం వల్ల ఎంతోమంది కళ్ళు లేని వారికి చూపును ప్రసాదించడం అదేవిధంగా ఎవరైనా ఆపదలో ఉంటే వారికి అవయవ దానం చేసి వారికి పునర్జన్మను ప్రసాదించడమే అవుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనికిరెడ్డి సతీష్, ప్రిన్సిపాల్ అమరేందర్ డాక్టర్ ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు, క్యాతం మల్లేశం పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ ప్రవేశాల గడువు పెంపు...




కరీంనగర్/జమ్మికుంట/ఆగష్టు 12/అక్షరం న్యూస్:

జమ్మికుంట స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం దూరవిద్యలో మొదటి సంవత్సరం బిఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల అయ్యిందని జమ్మికుంట డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రమేష్ తెలిపారు. దరఖాస్తులు ఆన్లైన్ ద్వారా చేసుకోవచ్చుని, సెప్టెంబర్ 9 వరకు అవకాశం ఉందని అన్నారు. అదేవిధంగా ద్వితీయ సంవత్సరం,తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజ్ ఆన్లైన్ ద్వారా చెల్లించాలని తెలిపారు. పూర్తి సమాచారం కొరకు 73829 29775 సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## సచ్దేవా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



జ్యోతినగర్ ఎన్టిపిసి ఆగస్టు 12 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా సచ్దేవా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, ఎన్‌టీపీసీ జ్యోతినగర్ ఆధ్వర్యంలో బుధవారం దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటేలా ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సుమారు 700 మంది విద్యార్థులు, పాఠశాల ప్రిన్సిపాల్.గ్యాన్ చంద్ , ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ర్యాలీ మేడిపల్లి సెంటర్ నుంచి ప్రారంభమై ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్స్ మీదుగా ఎన్‌టీపీసీ టౌన్‌షిప్ వరకు కొనసాగింది. విద్యార్థులు జాతీయ పతాకాలను చేతబూని దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. జాతీయ జెండా పట్ల గౌరవం, దేశభక్తి, జాతీయ సమైక్యత మరియు దేశం పట్ల బాధ్యతను ప్రతి ఒక్కరిలో పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనడం పట్ల ప్రిన్సిపాల్ అభినందనలు తెలిపారు. "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.






## ఎన్టిపిసి అన్నపూర్ణ కాలనీలో ప్రభాకర్ కుటుంబానికి క్వింటాల్ బియ్యం అందజేత

- ఆపదలో అండగ నిలిచిన శ్రీరామాంజనేయనాయి బ్రాహ్మణ సేవా సంఘం



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 12 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీకి చెందిన సుందరగిరి ప్రభాకర్ అనారోగ్యంతో మృతి చెందడంతో విషాదంలో మునిగిన కుటుంబానికి బుధవారం శ్రీ రామాంజనేయ నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు మానవతా దృక్పథంతో అండగా నిలిచారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సంఘం సభ్యులు ఒక క్వింటాల్ బియ్యాన్ని అందజేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. కష్టకాలంలో కుటుంబానికి అవసరమైన సహాయం అందించడం ద్వారా సంఘం సభ్యులు సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న తమ వర్గ కుటుంబాలకు అండగా నిలవడమే సంఘం ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు చెన్న రాములు, కార్యదర్శి కంది తిరుపతి, మరియు కుల బాంధవులు విలాసాగరం అంజయ్య, ముత్యాల రాజయ్య, చెన్న కొమురయ్య, కంది సాగర్, చెన్న లక్ష్మణ్, గజ్జెల రణధీర్, కంది విజయ్, రసమల్ల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీపీసీ గేటు వద్ద ఏఐటీయూసీ మహాసభల కరపత్రం విడుదల

- కార్మిక హక్కుల రక్షణ కోసం ఐక్యంగా పోరాడాలి: కడారి సునీల్



జ్యోతి నగర్ ఎన్టిపిసి, ఆగస్టు 12 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: పెద్దపల్లి జిల్లా ఏఐటీయూసీ నాలుగో జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం ఉదయం ఎన్టీపీసీ నంబర్-2 గేటు వద్ద ఏఐటీయూసీ నాయకులు కరపత్రాలను విడుదల చేశారు. సుల్తానాబాద్‌లో ఆగస్టు 20న జరగనున్న జిల్లా మహాసభలకు కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ మాట్లాడుతూ కార్మిక చట్టాలు, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటాలు కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. మహాసభల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కుల పరిరక్షణ, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించి పోరాటాలను రూపొందిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. రామగుండం ఏరియా ఫ్యాక్టరీ కాంట్రాక్ట్, క్యాజువల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శులు రెడ్డపాక లక్ష్మణ్, నాంసాని శంకర్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా మహాసభలకు కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, అర్జున్, నారాయణరెడ్డి, రవి, వేణు, శ్రీనివాస్, సదానందం, శ్యామ్‌చారి, మల్లేష్, వెంకన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## అధిక లాభాల ఆశకు మోసపోవద్దు.. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930కు కాల్ చేయండి

- సింగరేణి అధికారులకు సైబర్ నేరాలపై అవగాహన



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 12 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సురక్షా కా తిరంగా -- సైబర్ ఇండిపెండెంట్ తెలంగాణ వైపు" కార్యక్రమంలో భాగంగా ఇల్లందు క్లబ్‌లో సింగరేణి అధికారులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలు, వాట్సాప్,టెలిగ్రామ్ ద్వారా వచ్చే అధిక లాభాల పెట్టుబడి ఆఫర్లు,నకిలీ షేర్ల వ్యాపార యాప్‌లను నమ్మి,పదవీ విరమణ అనంతరం వచ్చిన డబ్బులను పెట్టుబడి పెట్టి మోసపోవద్దని సూచించారు. అదేవిధంగా డిజిటల్ అరెస్ట్,కేవైసీ,పెన్షన్, పీఎఫ్,లాటరీలు, రుణాలు,ఉద్యోగాల పేరుతో జరిగే సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అపరిచిత వ్యక్తులు ఇచ్చే పెట్టుబడి సూచనలను నమ్మవద్దని,అధిక లాభాల పేరుతో వెంటనే పెట్టుబడి పెట్టాలని ఒత్తిడి చేసే వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పించారు. అనంతరం సింగరేణి అధికారులతో సైబర్ నేరాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు,సింగరేణి అధికారులు,సైబర్ క్రైమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం.. ప్రతి హృదయంలో దేశభక్తి!





- దేశం కోసం సేవ చేసిన మాజీ సైనికులకు ఘన సత్కారం!!
- వాకర్స్‌కు జాతీయ పతాకాల పంపిణీ -- మాజీ సైనికులకు ఘన సన్మానం..!

జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 12 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా బుధవారం గోదావరిఖని పీజీ కాలేజ్ గ్రౌండ్‌లో వాకర్స్‌కు జాతీయ పతాకాలను బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లికందుల సంధ్యారాణిలి అందజేశారు. ఈ సందర్భంగా దేశ రక్షణ కోసం తమ కుటుంబాలను, వ్యక్తిగత జీవితాలను సైతం పక్కనపెట్టి సేవలందించిన మాజీ సైనికులను కందుల సంధ్యారాణి శాలువాలతో ఘనంగా సత్కరించారు. దేశం కోసం సేవ చేసిన వీర సైనికులను గౌరవించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని, వారిని సన్మానించుకోవడం తనకు ఎంతో గర్వకారణంగా ఉందని ఆమె అన్నారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు ఎస్. గంగరాజు, ఈ. శ్రీను, పి. భాస్కర్, కార్తీక్, ఎం. జర్మయ్య, టి. రాముడు, ఎ. అంబారావు, వి. శ్రీనివాస్, లక్ష్మణ్ సింగ్, ఎస్. శంకర్, ఎస్.కె. నజీబ్, ఎస్. సుధాకర్, శ్యాం కుమార్, నాగరాజు, సంతోష్, నరసింహులు, రాంబాబు, బి. పోచన్నను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కందుల సంధ్యారాణి మాట్లాడుతూ: భారతదేశంలో జన్మించడం, భారతీయులుగా జీవించడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని అన్నారు. భారతదేశం సమానత్వానికి ప్రతిరూపమని, మన సంస్కృతి--సంప్రదాయాలకు నిలయమని, ఎందరో మహనీయుల త్యాగాలకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపైనా జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని, జాతీయ ఐక్యతను, సమగ్రతను చాటాలని రామగుండం నియోజకవర్గ ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం మన దేశ సమగ్రత, ఐక్యత, దేశభక్తిని చాటే గొప్ప సందర్భమని, ఆగస్టు 10 నుంచి 15 వరకు నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములై తమ దేశభక్తిని చాటాలని కోరారు. భావితరాలకు దేశభక్తి, జాతీయ ఐక్యత విషయంలో ప్రతి ఒక్కరూ ఆదర్శంగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం వాకర్స్, మాజీ సైనికులతో కలిసి దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న వారంతా జాతీయ జెండాలను చేతబూని 'భారత్ మాతా కీ జై', 'వందే మాతరం' తదితర నినాదాలతో దేశభక్తిని చాటారు. ఈ కార్యక్రమంలో జనగామ మండల అధ్యక్షులు గుండబోయిన భూమయ్య, లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ, బీజేపీ నాయకులు కోడూరి రమేష్, పాకాల నరసింహారెడ్డి, బియ్యాల మహేందర్, కొట్టే నరేష్, బండారి శ్యామ్ పటేల్, జక్కన బాలు, ఆకునూరి రమేష్, జక్కుల ప్రవీణ్, వెల్తూరి సరిత--రాజయ్య, ఏరుకొండ తిరుపతి, మీస వికాస్, వెంకటేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.





## సర్ ప్రక్రియపై కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సభ్యులతో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సమీక్ష



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 12 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: రామగుండం నియోజకవర్గంలో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన ప్రత్యేక సమగ్ర పునఃపరిశీలన ప్రక్రియపై రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా కార్యవర్గ సభ్యులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగిన సర్వే తీరుతెన్నులు, ప్రజల స్పందన, ఓటర్ల వివరాల పరిశీలన తదితర అంశాలపై చర్చించారు. ఇంటింటి సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఎదురైన సమస్యలు, ఓటర్ల వివరాల నమోదులో తలెత్తిన ఇబ్బందులు, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉన్నాయా లేదా అనే అంశాలతో పాటు మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలపై ఎమ్మెల్యే నాయకులను అడిగి తెలుసుకున్నారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి అర్హులైన ఓటరు పేరు జాబితా నుంచి తొలగిపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. ఓటర్ల జాబితా సక్రమంగా ఉండటం ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. ముఖ్యంగా ఇంటింటి సర్వేలో గుర్తించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించినట్లు సమాచారం. నియోజకవర్గంలో ాx= ప్రక్రియ ముగిసినప్పటికీ ఓటర్ల జాబితాకు సంబంధించిన అంశాలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సమావేశం ద్వారా స్పష్టమైంది. అర్హులైన ఓటర్ల హక్కులను పరిరక్షించడంతో పాటు జాబితాలోని తప్పులను గుర్తించి సరిదిద్దేందుకు రాజకీయ పార్టీల క్షేత్రస్థాయి యంత్రాంగం కీలకంగా మారనుంది.

సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా కార్యవర్గ సభ్యులు, నాయకులు, కార్పొరేటర్లు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమావాస్యనాడు 600 మందికి అన్నదానం....





సూర్యాపేట /నేరేడుచర్ల, ఆగస్ట్ 12అక్షరం న్యూస్

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి సేవా కమిటీ నేరేడుచర్ల ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా సుమారు 600 మంది బాటసారులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. దాతల సహాయ సహకారాలతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని గత 22 నెలలుగా నిరంతరంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి సహకరిస్తున్న ప్రతి దాతకు కమిటీ సభ్యులు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచకొండ శ్రీనివాసరావు, ఊట్కూరు నటరాజు, కందిబండ శ్రీనివాసరావు, ఉప్పల పుల్లయ్య, పోలిశెట్టి వెంకటేశ్వర్లు, జూలూరి అశోక్, తడకమళ్ల పరమేశం, భువనగిరి అంజయ్య, గుండా సత్యనారాయణ, గుంటూరు శ్రీనివాస్, మిట్టపల్లి దయాకర్, గరిణె వెంకన్న, చందా కిషన్, చెరుకు రాము, చారగుండ్ల వెంకటేశ్వర్లు, ఓరుగంటి గణేష్, దేవర్శెట్టి వెంకటేశ్వర్లు, రాచకొండ రవి, రాచకొండ విజయ్, తాళ్లూరు శ్రీనివాస్, గజవెల్లి నరసింహారావు, కుక్కడపు శ్రీనివాస్, వెంపటి జానకిరామయ్య, గరిణె వాసు, పారేపల్లి అశోక్, కుక్కుండ్ల వెంకటేశ్వర్లు, బొడ్డు నాగేశ్వరరావు, కొత్తూరు లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సులబ్ కార్మికులకు రావలసిన 4.నెలల జీతాలు... హౌస్ కీపింగ్ కార్మికులకు 5. నెలలు జీతాలు ఇప్పించాలి.. జియం కు వినతి



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 12 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

సింగరేణి సంస్థ రామగుండం ఏరియా వన్ డివిజన్ పరిధిలో సులబ్ కాంప్లెక్స్ లలో పనిచేస్తున్న కార్మికులకు గత నాలుగు నెలల నుండి మరియు వన్ గ్రూప్ మైన్స్ లలో హౌస్ కీపింగ్ కార్మికులకు 5 నెలల నుండి జీతాలు రాక వారి కుటుంబాలను పోషించుకోలేక అనేక అవస్థలు పడుతున్నారు.సులబ్ ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సంస్థ పేరిట సులబ్ కార్మికులను మోసం చేస్తుందని వీరికి నేటికీ పిఎఫ్ ఈఎస్ఐ బోనస్ వీడిఎ ఇన్సూరెన్స్ ఉచిత వైద్యం ఇతర తదితర చట్టబద్ధ హక్కులు అమలు కావడం లేదు సమాజంలో ఎవ్వరు చేయలేని పనులు చేస్తూ మురికి కంపులో ఉంటూ సులబ్ కాంప్లెక్సను శుభ్రం చేస్తున్నారు ఈ మురికి కంపులో పనిచేస్తున్న ఈ కార్మికులు అనారోగ్యలకు గురవుతున్నారు. ఈ కార్మికులకు హాస్పటల్ సౌకర్యం కల్పించి వైద్య సదుపాయాలు అందించాల్సిన బాధ్యత యాజమాన్యానికి ఉంది అలాగే వన్ గ్రూప్ కార్మికులు గత 5.నెలల జీతాలు, పనిముట్లు కాంట్రాక్టర్ ఇవ్వడంలేదని ఎన్నిసార్లు అధికారులను కలిసిన ఫలితం లేదు. కాగా మంగళవారం సులబ్ , వన్ గ్రూప్ మైన్స్ లలో పనిచేస్తున్న హౌస్ కీపింగ్ కార్మికుల సమస్యల పై జిఎం లలిత్ కుమార్ ని కలిసి సమస్యలను వివరించి వినతి పత్రాలు సమర్పించారుఇప్పటికైనా ఇట్టి విషయాలను సింగరేణి యాజమాన్యం ఈ కార్మికుల సమస్యలపై పూర్తిస్థాయిలో పరిశీలన చేసి సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని "సులబ్ కార్మికులకు రావలసిన 4. నెలల జీతాలు, వన్ గ్రూప్ మైండ్స్ లలో పనిచేస్తున్న హౌస్ కీపింగ్ కార్మికులకు రావలసిన 5 నెలల జీతాలు పనిముట్లు ఇప్పించాలని జిఎం లలిత్ కుమార్ ను కోరారు. ఈ వినతి పత్రం ఇచ్చే కార్యక్రమంలో ఐ ఎఫ్ టీ యు రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ, జిల్లా అధ్యక్షులు ఈ నరేష్, ఎస్ ఎస్ సి డబ్ల్యు యు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఐ రాజేశం, ఆర్ జీవన్ అధ్యక్షులు కోట వెంకన్న,నాయకులు ఓదెలు, రామారావు, నవీన్, సుదర్శన్,చంటి. తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల హక్కుల కోసం ఏఐఎస్ఎఫ్ పోరాటం




సూర్యాపేట /నేరేడుచర్ల ఆగస్టు 12 అక్షరం న్యూస్

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని నేరేడుచర్లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు కొమర్రాజు వెంకట్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు పరికె భరత్ మాట్లాడుతూ 1936 ఆగస్టు 12న లక్నోలో ఆవిర్భవించిన ఏఐఎస్ఎఫ్ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిందన్నారు. నేటి విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ విజయలక్ష్మి పుట్టినరోజున లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం




సూర్యాపేట /నేరేడుచర్లఆగస్టు 12 అక్షరం న్యూస్

లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో 14వ వార్డు కౌన్సిలర్ సరికొప్పుల విజయలక్ష్మి నాగేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా అల్పాహార కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు షేక్ యూసఫ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుమారు 200--300 మందికి అల్పాహారం అందించారు.కౌన్సిలర్ విజయలక్ష్మి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని, తన పుట్టినరోజున ప్రజలకు అల్పాహారం అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

# సంఘ భవనాన్ని కూల్చడాన్ని తీవ్రంగా ఖండించిన ముదిరాజులు





- **ఎమ్మెల్యే, మేయర్ చొరవ తీసుకొని వెంటనే ముదిరాజ్ సంఘ భవనాన్ని నిర్మించి ఇవ్వాలి**

జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 12 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: ముదిరాజుల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఉన్న సంఘ భవనాన్ని కూల్చివేయడాన్ని ముదిరాజ్ కులస్తులు, జిల్లా నాయకులు, గంగానగర్ కాలనీవాసులు తీవ్రంగా ఖండించారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్ గంగానగర్‌లో అభివృద్ధి పనుల పేరుతో ముదిరాజ్ సంఘ భవనాన్ని కూల్చివేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.మంగళవారం ఐదో డివిజన్‌లో అభివృద్ధి పనుల పరిశీలనకు నగర మేయర్ వచ్చిన సందర్భంగా ముదిరాజ్ కులస్తులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. కాలువల శుభ్రత, పారిశుద్ధ్య పనుల్లో భాగంగా ముదిరాజుల సంఘ భవనాన్ని కూల్చివేయాల్సిన అవసరం ఏముందని వారు ప్రశ్నించారు. సుమారు మూడు దశాబ్దాల క్రితం, 1994లో ముదిరాజ్ సంఘ సభ్యులు తమ సొంత నిధులతో స్థలాన్ని కొనుగోలు చేసి భవనాన్ని నిర్మించుకున్నారని తెలిపారు. ముదిరాజ్ సంఘ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా, వారి అంగీకారం లేకుండా సంఘ భవనాన్ని కూల్చివేయడం బాధాకరమని పేర్కొన్నారు. ఇలాంటి అనాలోచిత నిర్ణయాలతో కులాల మధ్య చిచ్చు పెట్టే పరిస్థితులు ఏర్పడతాయని, ముదిరాజుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను సహించబోమని హెచ్చరించారు. ముదిరాజుల ఐక్యతకు ప్రతీకగా ఉన్న భవనాన్ని తమకు తెలియకుండా ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించారు.భవన కూల్చివేతకు కారణమైన వారిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నగర మేయర్, ఎమ్మెల్యే వెంటనే స్పందించి ముదిరాజ్ సంఘానికి న్యాయం చేయాలని, అదే స్థలంలో లేదా ప్రత్యామ్నాయంగా అన్ని సౌకర్యాలతో నూతన సంఘ భవనాన్ని నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పిడుగు కృష్ణ, కార్పొరేషన్ ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి దబ్బెట శంకర్, గంగానగర్ కాలనీ కమిటీ సభ్యులు గణవేన సంపత్, ఊదరి సంపత్, దెవిని సంపత్, పిట్టల వంశీ, దేవిని శేఖర్, రేండ్ల శ్రీనివాస్, సుక్క సతీష్, దేవిని కనకయ్య, పందుల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పనుల్లో స్పీడు పెంచాలి





- **అర్హులకే ఇండ్లు ఇస్తాం.. లబ్ధిదారుల జాబితా పరిశీలిస్తున్నాం...**
- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

సూర్యాపేట /హుజుర్ నగర్ /ఆగస్టు 12 అక్షరం న్యూస్

అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

హుజుర్ నగర్ డబుల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, చిన్న చిన్న లోపాలు ఉన్నా వెంటనే రెక్టిఫై చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ఇండ్ల సముదాయాల్లో మిగిలిపోయిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హుజుర్ నగర్ రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీ ఇండ్లను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా పంపిణీ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు.

### ప్రతి బ్లాక్‌లో ఇన్స్పెక్షన్లు..

ఇటీవల మంత్రి ఆదేశాల మేరకు హౌసింగ్ యూనిట్లలోని ప్రతీ బ్లాక్‌ను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇండ్లలో ఉన్న చిన్న చిన్న లోపాలను గుర్తించి, వాటి జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఆ లోపాలను వెంటనే సరిదిద్దాలని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇండ్లతో పాటు డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పన పనులను వేగవంతం చేయాలని సూచించారు.

### తెలంగాణ పబ్లిక్ స్కూల్ పనులు వేగవంతం

ఇండ్ల సముదాయం ప్రాంగణంలో మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవన పునాది పనులు, డైనింగ్ హాల్ నిర్మాణాలు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. వీటితో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణ పనులకు ప్రాధాన్యతనిచ్చి పూర్తి చేయిస్తున్నట్లు వివరించారు. వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను హెచ్చరించారు.

### 1,805 మందితో తాత్కాలిక జాబితా

ఆర్డీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా ప్రాథమికంగా 1,805 మంది అర్హులైన లబ్ధిదారులతో జాబితాను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. అయితే ఈ జాబితాపై వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాలను ప్రత్యేక బృందాల ద్వారా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని తెలిపారు. అర్హత లేని వారి పేర్లు ఉంటే తొలగిస్తామని, నిజమైన పేదలకు మాత్రమే ఇండ్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు పిడి హౌసింగ్ జబ్బర్ హేహ్మద్, తహసిల్దార్ కవిత మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్, గుద్దేదారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాలకు దూరంగా.. ఆరోగ్యకర జీవితానికి బాట...





సూర్యాపేట /నేరేడుచర్ల/ఆగష్టు 12 అక్షరం న్యూస్

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితం గడపాలని వక్తలు పిలుపునిచ్చారు. నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డ్రగ్ ఫ్రీ ప్రతిజ్ఞ నిర్వహించారు.

బ్రహ్మకుమారీస్ మిర్యాలగూడకు చెందిన బి.కె. శకుంతల విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

కార్యక్రమాన్ని జాతీయ సేవా పథకం అధికారి వనపర్తి శ్రీనివాసులు సమన్వయం చేయగా, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటరమణ, అధ్యాపకులు డా. ఎం. సైదులు, ప్రణతి, కె.ఎల్. నరసింహారావు, వెంకన్న శ్రీనివాసులు, నరసింహాచారి, ప్రసాద్, వీరు, వెన్నెల, అపర్ణ, వీరేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## అమృత్ 2 పనుల పరిశీలన



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/,ఆగస్టు-12(అక్షరం న్యూస్ )

మున్సిపాలిటీలోని 1వ వార్డులో అమృత్ 2.0 పథకం ద్వారా చేపడుతున్న సీసీ రోడ్డు మరమ్మతు పనులను బుధవారం మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, వైస్ చైర్ ప ర్సన్ మత్తమాల భాగ్యవతి పరిశీలించారు.ఈ సంద ర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పను లను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రా క్టర్‌కు సూచించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులుచే పట్టి త్వరిత గతన పనులను పూర్తి చేయాలని సూచిం చారు .రోడ్డు మరమ్మతు పనులు పూర్తయితే స్థానికప్రజ లకు రాకపోకలకు సౌకర్యం ఏర్పడడంతో పాటు,ఆ ప్రాం త అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని చైర్మన్ పద్మ శ్రీకాంత్ తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగానే అభివృద్ధిపనులనుకొనసాగిస్తామని వైస్ చైర్ పర్సన్ భా గ్యవతి పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చై ర్మన్ ప్రశాంత్ గౌడ్, కౌన్సిలర్లు తిరుపతి, చంద్రయ్య, స య్యద్ గఫార్,శ్యామ్ సుందర్ తదితరులుపాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాల హెడ్ బాయ్‌గా సాయికుమార్ ఎన్నిక



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/ఆగస్టు -12(అక్షరం న్యూస్) ఎల్లారెడ్డి ఆదర్శ పాఠశాలలో 2026-27 విద్యా సంవ త్సరానికి గాను హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్ పదవులకు నిర్వహించిన ఎ న్నికల ఫలితాలు బుధవారం వెలువడ్డాయి.ఈ ఎన్నిక ల్లో పాఠశాల హెడ్ బాయ్‌గా సాయికుమార్ 358 ఓట్ల తో విజయం సాధించారు. హెడ్ గర్ల్‌గా అంజున 276 ఓ ట్లతో ప్రథమ స్థానంలో నిలిచారు.డిప్యూటీ హెడ్ బాయ్ పదవినిరాహుల్ 409ఓట్లతో కైవసం చేసుకోగా, డిప్యూ టీ హెడ్ గర్ల్‌గా ఇందు 257 ఓట్లతో ఎన్నికయ్యారు.ఎ న్నికల ప్రక్రియలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పా ల్గొన్నారు. విజేతలను పాఠశాల అధ్యాపక బృందం అభి నందించి శుభాకాంక్షలు తెలిపింది.ఈ కార్యక్రమంలో పా ఠశాల ప్రిన్సిపల్ గాంధీ, వైస్ ప్రిన్సిపల్ జహంగీర్, అధ్యా పక బృందం రాజశేఖర్, ప్రియదర్శిని, లక్ష్మణ్ సింగ్, బల్ వంతరావు, విద్యారమణ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల బాలికల పాఠశాల ఆకస్మిక తనిఖీ





కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/ఆగస్టు12(అక్షరం న్యూస్) ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలను ఎల్లారెడ్డి ఆర్డీవో ఆర్. ప్రభాకర్ ఆ కస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయనపా ఠశాలలోని తరగతి గదులు, వసతి గృహం,వంటశాలను పరిశీలించారు.విద్యార్థులకు అందిస్తున్న భోజనంనాణ్య త, పరిశు భ్రత,తాగునీరుతదితర సౌకర్యాల గురించి ప్రి న్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో ప్రభాకర్,తహసీల్దార్ ప్రేమ్ కుమార్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకా రం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు.వి ద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు.పాఠశాలలో విద్యా ర్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని ఎలాం టి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.

## అక్రమ బెల్ట్ షాపులపై పోలీసులకొరడా

జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ ) ఆగస్టు 12: మండలంలో ని ఫతేషాపూర్ గ్రామంలో అనుమతులు లేకుండా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వ్యక్తులను పోలీసులు స్టేషన్ లో కౌన్సిలింగ్ ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై నరేశ్ హెచ్చరించారు. అనంతరం వారిని తహశీల్దార్ ఎదుట హాజరుపరిచారు. అక్రమ మద్యం విక్రయాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.



# అశ్వారావుపేటలో సీపీఐ ప్రజా చైతన్య యాత్రల ముగింపు సభ ఘనం







- రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి.. పంటలకు ఎంఎస్పీ గ్యారెంటీ చట్టం తేవాలి
- కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలి.. ప్రజా సమస్యలపై పోరాటాలను ఉధృతం చేస్తాం

భద్రాద్రి కొత్తగూడెం /అశ్వారావుపేట /ఆగస్టు 12/అక్షరం న్యూస్ :- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ చేపట్టిన ప్రజా చైతన్య యాత్రల ముగింపు సభ బుధవారం అశ్వారావుపేటలో ఘనంగా జరిగింది. ఆగస్టు 6న బయ్యారం నుంచి ప్రారంభమైన ప్రజా చైతన్య యాత్ర అశ్వారావుపేటలో ముగిసింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు యాత్రకు ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని ప్రధాన కేంద్రాల మీదుగా భారీ ప్రదర్శన నిర్వహించారు.

### అరుణ పతాకాల ఆవిష్కరణ

సీపీఐ జాతీయ సభ సభ్యులు రజబ్ అలీ భవన్ వద్ద పార్టీ అరుణ పతాకాన్ని ఆవిష్కరించి ముగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అశ్వారావుపేట రింగ్‌రోడ్ సెంటర్‌లోని సయ్యద్ మీయాజాని విగ్రహం వద్ద జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో సీపీఐ బలోపేతానికి సయ్యద్ మీయాజాని చేసిన నిస్వార్థ సేవ, కృషిని నాయకులు కొనియాడారు.

### బీజేపీ విధానాలపై హేమంతరావు ధ్వజం

ముగింపు సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత 12 ఏళ్లుగా ప్రజలు, రైతులు, కార్మికులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడంలో విఫలమైందని విమర్శించారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రజా సమస్యలపై చర్చించకుండా ఇతర అంశాలతో పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు.

నిత్యావసర వస్తువులు, గ్యాస్, పెట్రోల్ ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి, యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించకపోగా ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగిస్తున్నారని విమర్శించారు.నీట్ ప్రవేశ పరీక్షలో అవకతవకలు, లీకేజీ ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టాన్ని తీసుకురావడంలో విఫలమైందన్నారు. విదేశీ వాణిజ్య ఒప్పందాల పేరుతో వ్యవసాయ రంగానికి నష్టం కలిగించే విధానాలను విడనాడాలని కోరారు.

కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం ద్వారా కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని హేమంతరావు విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

### కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఆరు గ్యారెంటీలు, ఇతర ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో అలసత్వం వహిస్తోందని హేమంతరావు అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### పేదల సమస్యలపై పోరాటం

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా మాట్లాడుతూ పాత పింఛన్లు, మహాలక్ష్మి పథకం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల వంటి హామీల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ పదేపదే దరఖాస్తులు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అశ్వారావుపేటతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పేదల ఇళ్లు, గుడిసెల తొలగింపు సరికాదన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

రైతులు, కార్మికులు, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ప్రజా పోరాటాలను మరింత ఉధృతం చేయడమే మార్గమని స్పష్టం చేశారు.

### భూసమస్యలు పరిష్కరించాలి

సీపీఐ అశ్వారావుపేట నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం మాట్లాడుతూ నియోజకవర్గంతో పాటు అశ్వారావుపేట పట్టణంలో అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. అశ్వారావుపేట పరిసర ప్రాంతాల్లో భూస్వాముల ఆధీనంలో ఉన్న వందల ఎకరాల భూములపై సమగ్ర లెక్కలు తేల్చాలని డిమాండ్ చేశారు.

సర్వే నంబర్ 1228లో పేదల ఇళ్లను కూల్చివేసిన ఘటనపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని, బాధితులకు స్థలాలు కేటాయించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

### పలువురు నాయకుల పాల్గొనడం

ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సరిశెట్టి పుల్లారెడ్డి, సీపీఐ అశ్వారావుపేట మండల ఇన్‌చార్జ్ రామకృష్ణ, మండల కార్యదర్శి అర్జున్‌రావు, పట్టణ కార్యదర్శి నూకవరపు విజయ్‌కాంత్, మున్నా లక్ష్మీకుమారి, నరాటి ప్రసాద్, చంద్ర నరేంద్రకుమార్, చంద్రగిరి శ్రీనివాసరావు, అబ్బాస్, చెన్నారావు, జలాల్, అనిల్, ముత్తు, సత్యవతి, శ్రావణి, రోహిణి, పోసి, మున్నా, రాజు, నాగేశ్వరరావు, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమాలయ్య, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, మువ్వా వెంకటేశ్వర్లు, కందుల భాస్కర్, ఎస్.కె. ఫహీం, ప్రజాసంఘాల జిల్లా బాధ్యులు భూక్యా శ్రీనివాస్, వరక అజిత్, వేముకొండలరావు, నిమ్మల రాంబాబు, రత్నకుమారి, కార్పొరేటర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాసంఘాల నాయకులు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై అఖిలపక్ష సమావేశం

. వంద శాతం డిజిటలైజేషన్ పూర్తి, 9 కొత్త పోలింగ్ కేంద్రాలకు ఆమోదం

. ఆర్డీఓ: ఆర్. ప్రభాకర్



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/ఆగస్టు 12(అక్షరం న్యూస్ )

స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ - ఎస్ఐ ఆర్ ప్రక్రియలో భాగం గా ఎల్లారెడ్డి ఆర్డీఓ ఆర్. ప్రభాకర్ బుధవారం ఆర్డీఓ కా ర్యాలయంలో అఖిలపక్ష నాయకులతోసమావేశం ఏర్పా టు చేశారు. ఓటరు జాబితా సవరణ, కొత్త పోలింగ్ కేం ద్రాల ఏర్పాటు,ఎస్ఐఆర్ పురోగతిపై విస్తృతంగా చర్చిం చారు. ఆర్డీఓ తెలిపిన వివరాల ప్రకారం నియోజకవర్గం లో మొత్తం 2,28,503 ఎన్యుమరేషన్ ఫారాలను పంపి ణీ చేయగా, వాటిని బీఎల్ఓ యాప్ ద్వారా 100 శాతం డిజిటలైజ్ చేశారు. పరిశీలనలో 22,469 ఫారాలు మర ణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, డబుల్ ఓటర్లుగా గుర్తించారు.లికొత్త పోలింగ్ కేంద్రాలులితెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మే రకు 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రా లను విభజించనున్నారు. ఇందులో భాగంగా కొత్తగా 9 పోలింగ్ కేంద్రాలకు ఆమోదం లభించింది. ంధారి - 3, లింగంపేట్ - 3, నాగిరెడ్డిపేట్ - 1, సదాశివ నగర్ - 1, ఎల్లారెడ్డి - 1లిమండలాల వారీగా గుర్తించిన వివరాలు:లిలిఆన్ మ్యాప్ ఫారలులిగాంధారి792, లింగంపేట్ 291,నాగిరెడ్డిపేట్ 303,రాజం పేట 57,రామారెడ్డి 641,సదాశివనగర్ 912,తాడ్వాయి 185, ఎల్లారెడ్డి 569లిమరణించిన ఓటర్లు:లి గాంధారి 1203, లింగంపేట్ 1 255, నాగిరెడ్డిపేట్ 903,రాజంపేట 342,రామారెడ్డి 656, సదాశివనగర్ 1186, తాడ్వాయి 978, ఎల్లారెడ్డి1120

లిశాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు:లి

గాంధారి 1894, లింగంపేట్ 1409, నాగిరెడ్డిపేట్ 944, రాజంపేట 480, రామారెడ్డి 1112, సదాశివనగర్ 1492, తాడ్వాయి 1202, ఎల్లారెడ్డి 1508లిడబుల్ ఓటర్లు:లి గాంధారి 799, లింగంపేట్ 1201, నాగిరెడ్డిపేట్ 150, రాజంపేట 410, రామారెడ్డి 274, సదాశివనగర్ 972, తాడ్వాయి 560, ఎల్లారెడ్డి 363లితదుపరి షెడ్యూల్లిడ్రాఫ్ట్ ఓటరు జాబితాను ఈ నెల 17న విడుదల చేయ నున్నట్లు ఆర్డీఓ తెలిపారు. డ్రాఫ్ట్‌లో పేరు లేకపోయినా కంగారు పడాల్సిన అవసరం లేదని, సరైన పత్రాలతో ఆ గస్టు 17 నుంచి సెప్టెంబర్10 వరకుఆర్డీఓ కార్యాలయం లో క్లెయిమ్ లేదా అభ్యంతరం దాఖలు చేసుకోవచ్చని సూచించారు.తుది ఓటరు జాబితాను అక్టోబర్ 10న వి డుదల చేస్తారు.ఈ సమావేశంలో తహసీల్దార్ ప్రేమ్ కు మార్, గిర్దావర్ భరత్, ఎన్నికల సిబ్బందితో పాటు వివిధ పార్టీల ప్రతినిధులు ఎంఐఎం మండల అధ్యక్షులు అబ్దు ల్ రజాక్, బీజేపీ నాయకులు మర్రి బాల్ కిషన్ , నర్సిం లు, మాజీ సర్పంచ్ దేవేందర్, సతీష్, బీఆర్ఎస్ నుంచి అట్కూరి బబ్లు, కాంగ్రెస్, మొహమ్మద్ అజ్హర్ తదితరులు హాజరయ్యారు.

# సీఎస్ఆర్ నిధులతో మౌలిక వసతుల అభివృద్ధికి కేటీపీఎస్ సహకారం







- **రూ.95.90 లక్షల మూడో, తుది విడత నిధుల చెక్కును జిల్లా కలెక్టర్ అంకిత్‌కు అందజేసిన కేటీపీఎస్ అధికారులు.**

భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / ఆగస్టు 12 / అక్షరం న్యూస్ –:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మౌలిక వసతుల అభివృద్ధికి కేటీపీఎస్–7వ దశ సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధుల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి రూ.95,90,802ల మూడో మరియు తుది విడత నిధుల చెక్కును కేటీపీఎస్–7వ దశ చీఫ్ ఇంజనీర్ బి. శివరామ్ రెడ్డి జిల్లా కలెక్టర్ అంకిత్‌కు బుధవారం ఐ డి వో సి కార్యాలయం కలెక్టర్ ఛాంబర్ నందు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేటీపీఎస్ సివిల్ విభాగం సూపరింటెండింగ్ ఇంజనీర్ యు. గోపతి పాల్గొన్నారు.కేటీపీఎస్ సీఎస్ఆర్ నిధులతో పాల్వంచ పట్టణంలోని ఇందిరానగర్ నుంచి గిరిజన ప్రాంతమైన జగన్నాధపురం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి మండలాల్లోని వివిధ గ్రామపంచాయతీల పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ.2,39,70,802 నిధులను కేటాయించారు. ఇప్పటికే విడతల వారీగా నిధులు విడుదల చేయగా, తాజాగా రూ.95,90,802ల మూడో మరియు తుది విడత నిధుల చెక్కును జిల్లా కలెక్టర్ అంకిత్‌కు అందజేశారు.సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు ఆయా ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు దోహదపడనున్నాయని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు . ప్రభుత్వ రంగ సంస్థలు సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రాంతాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సీఎస్ఆర్ నిధులను వినియోగిస్తూ మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు.కేటీపీఎస్–7వ దశ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తయితే పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి మండలాల పరిధిలోని ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సదుపాయాలు, విద్యుత్ వెలుగులు అందుబాటులోకి రావడంతో ఆయా ప్రాంతాల అభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదపడనున్నాయి అన్నారు.

## దేశ స్వాతంత్రం కోసం ఆవిర్భవించిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్

- ప్రభుత్వ విద్య పరిరక్షణకై సమరశీల పోరాటాలు.
- విద్యార్థులకు అండగా ఏఐఎస్ఎఫ్ జెండా.
- జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్కె షాహిద్, వరక అజిత్.



భద్రాద్రి కొత్తగూడెం/కొత్తగూడెం/ ఆగస్టు 12 / అక్షరం న్యూస్ – : భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో ఆవిర్భవించిన ఏకైక విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అని ఆ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వరక అజిత్ అన్నారు. ప్రభుత్వ విద్య పరిరక్షణ, శాస్త్రీయ విద్య, కామన్ విద్యా విధానం కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాడుతోందని తెలిపారు.ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో అజిత్ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1936 ఆగస్టు 12న లక్నోలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందని, స్వాతంత్ర్య ఉద్యమం నుంచి నేటి వరకు విద్యార్థుల హక్కుల కోసం సంఘం అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు.ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, శాస్త్రీయ విద్య, సమాన విద్యా విధానం అమలు కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఏఐఎస్ఎఫ్ పోరాటాలు కొనసాగిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన జాతీయ విద్యా విధానం వల్ల ప్రభుత్వ విద్యారంగంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగంలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు ప్రాధాన్యం కల్పించే విధానాలను విద్యార్థులు, ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.శాస్త్రీయ దృక్పథంతో కూడిన విద్యకు బదులుగా మూఢనమ్మకాలు, పురాణాలను ప్రోత్సహించే విధానాలకు విద్యార్థులను దూరంగా ఉంచాలని అన్నారు. విద్యార్థి వ్యతిరేక విధానాలపై భవిష్యత్తులో మరిన్ని సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.90 ఏళ్లకు పైగా విద్యార్థి ఉద్యమ చరిత్ర కలిగిన ఏఐఎస్ఎఫ్ జెండా కింద విద్యార్థులంతా ఐక్యమై హక్కుల సాధన కోసం పోరాడాలని అజిత్ పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కొరిమి సంజయ్, కళాశాల సమితి సభ్యులు నిఖిల్, హాసిని, అంజలి, మౌనిక, కళ్యాణి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి/ ఆగస్టు 12/ అక్షరం న్యూస్–:

విద్యార్థి ఉద్యమాల దిక్సూచి ఏఐఎస్ఎఫ్ అని ఆ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఎస్.కె. సాబీర్ పాషా అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అరుణ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ దేశంలో విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 1936 ఆగస్టు 12న ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని, డిగ్రీలు పూర్తి చేసిన యువతకు భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ ఆక్ట్ (బిఎన్ఈజిఎ) అమలు చేసి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంఈఓ, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరారు. విద్యారంగ సమస్యలపై విద్యార్థులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్, జిల్లా అధ్యక్షులు ఎస్.కె. షాహిద్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అనుముల సాయి జిల్లా కమిటీ సభ్యులు రాజ్ కమల్, మానస, నవిత, మెహబూబీ, ధోని, నిఖిల్, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రి కళాశాలలో గో ప్లై ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ప్లేస్మెంట్ డ్రైవ్



పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / ఆగష్టు 12 / అక్షరం న్యూస్ –:

పెద్దపల్లి జిల్లాలోని గాయత్రి కళాశాలలో బుధవారం రోజున గోప్లై ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ప్లేస్మెంట్ డ్రైవ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గోప్లై టీం హెచ్ ఓ డి విశ్వరూపిణి మరియు హెచ్ఆర్ నఫిజా పాల్గొని ఉద్యోగ అవకాశాల గురించి వర్క్ ఎన్విరాన్మెంట్ గురించి జాబ్ రోల్ అండ్ కెరీర్ ప్రాస్పెక్ట్స్ మరియు వర్క్ ఎక్స్పీరియన్స్ గురించి విద్యార్థుల అమూల్యమైన కెరీర్ గురించి తెలియజేస్తూ విద్యార్థుల్లో కాన్ఫిడెన్స్ పెంచడం జరిగింది. 60 మంది విద్యార్థులు పాల్గొని వాళ్ళ రెస్యూమ్స్ అందజేయడం జరిగింది. ఈ అవకాశం కల్పించిన గోప్లై టీం ను కళాశాల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మరియు లెక్చరర్స్ పాల్గొన్నారు.

## కార్పొరేట్లకు దేశ సంపద దోపిడీ - సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

- ములకలపల్లిలో ఘనంగా సీపీఐ ప్రజా చైతన్య యాత్ర, బహిరంగ సభ.
- ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలను గద్దె దించడమే లక్ష్యంగా పోరాటం.




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /ములకలపల్లి /ఆగస్టు 12/ అక్షరం న్యూస్–:

ములకలపల్లి మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా చైతన్య యాత్ర బహిరంగ సభలో జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దేశ సంపదను అదానీ, అంబానీలకు తాకట్టు పెడుతున్న ప్రజా వ్యతిరేక ఎన్డీఏ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. పత్తి, మొక్కజొన్న, వరి, మిర్చి, పామాయిల్ పంటలకు కనీస మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, 3.5 వేల ఎకరాల పోడు భూములకు తక్షణమే హక్కు పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ వ్యాపారాల వల్ల చిన్న వ్యాపారులు రోడ్డున పడుతున్నారని, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ భూముల్లో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. సీతారామ ప్రాజెక్టు భూబాధితులకు ఎకరానికి 30 లక్షల పరిహారంతో పాటు దమ్మపేటలో డిగ్రీ కాలేజీ, ఐటీఐ, ఆర్టీసీ బస్ స్టాండ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం కల్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్డి సలీం, సరిరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీ కుమారి, నరాటి ప్రసాద్, చంద్ర నరేంద్ర కుమార్, చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమాలయ్య, వీసంశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్, కందుల భాస్కర్, జి వీరస్వామి, ఎస్కే ఫహీం, ప్రజాసంఘాల జిల్లా బాధ్యులు భూక్యా శ్రీనివాస్, వరక అజిత్, నిమ్మల రాంబాబు, కాటూరి రాము, రత్నకుమారి, కార్పొరేటర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు ప్రజాసంఘాల నాయకులు ములకలపల్లి మండల కార్యదర్శి యండి యూసఫ్, సిపిఐ మండల నాయకులు నారటి రమేష్, వీరు, అనుముల సాయి పువ్వాల లలిత రావు ఎస్కే జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

## టెండర్ గడువు ముగియడంతో షట్టర్లు సీజ్.

- **భారీగా పోలీసుల మోహరింపు.**

పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / ఆగష్టు 12 / అక్షరం న్యూస్ –:

పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో అధికారులు కఠిన చర్యలకు దిగారు. టెండర్ గడువు ముగిసినప్పటికీ దుకాణాలను ఖాళీ చేయకుండా కొనసాగిస్తున్న వ్యాపారులకు పలుమార్లు నోటీసులు జారీ చేసిన అధికారులు.. ఎట్టకేలకు షాపుల షట్టర్లను సీజ్ చేశారు. షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాల టెండర్ గడువు ముగిసిన నేపథ్యంలో వాటిని ఖాళీ చేయాలని అధికారులు ఇప్పటికే ఐదుసార్లు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అయితే నోటీసులకు సంబంధిత దుకాణదారుల నుంచి స్పందన లేకపోవడంతో అధికారులు బుధవారం చర్యలకు పూనుకున్నారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య చర్యలు చేపట్టారు షట్టర్ల సీజ్ ప్రక్రియ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు భారీగా పోలీసు బలగాలను మోహరించారు. పోలీసులు



బందోబస్తు నిర్వహిస్తుండగా అధికారులు ఒక్కో దుకాణం షట్టర్‌ను సీజ్ చేస్తూ ముందుకు సాగారు. టెండర్ గడువు ముగిసిన తర్వాత కూడా దుకాణాలను ఖాళీ చేయకుండా కొనసాగించడంపై అధికారులు గతంలోనే పలుమార్లు హెచ్చరించినప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడంతోనే ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

## ఆపదలో ఆదుకుంటున్న ఆపద్బాంధవుడు

- 84వ సారి రక్తదానం చేసిన డాక్టర్ బాలు.
- తలసేమియా చిన్నారి కదం కీర్తనకు రక్తం అందజేత.




కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/ఆగస్టు12/అక్షరం న్యూస్: ఆపదలో ఉన్నవారికి స్వయంగా రక్తాన్ని అందించడమే కాకుండా ఇతరులను కూడా రక్తదానానికి ప్రోత్సహిస్తూ, ఎన్నో రక్తదాన శిబిరాలను విజయవంతంగా నిర్వహిస్తు న్న ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమ న్వయకర్త డాక్టర్ బాలు బుధవారం 84వసారి రక్తదానం చేస్తూ, చిన్నారి జీవితాన్ని కాపాడారు.నిజామాబాద్ జి ల్లా కేంద్రంలో తల సేమియా వ్యాధితో బాధపడుతున్న నిర్మల్ జిల్లాకు చెందిన కదం కీర్తన(12)కు ఓ పాజిటివ్ రక్తం అవసరముండగా విషయాన్ని తెలుసుకున్న ఆయ న వెంటనే నిజామాబాద్ బ్లడ్ సెంటర్ కు వెళ్లి 84వ సారి రక్త దానం చేసి చిన్నారి జీవితాన్ని కాపాడారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ తల సేమియా వ్యాధి చి న్నారులకు జీవితాంతం ప్రతి 15 రోజులకు ఒక యూని ట్ రక్తం అవసరం ఉంటుందని,ఆ చిన్నారుల ప్రాణాల ను కాపాడడానికి యువత ముందుకు రావాలని ఈ సం దర్భంగా ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం లో 6000 మంది చిన్నారులు ఉమ్మడి నిజామాబాద్ జి ల్లాలో 250 మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారని, వీ రికి కావాల్సిన రక్తాన్ని అందజేయడానికి రక్తదాన శిబిరా లను నిర్వహిస్తున్నామని అవసరమైతే మరిన్ని రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రంగ కిషన్, బీమాగౌడ్,బ్లడ్ బ్యాంక్ నిర్వా హకులు బట్టు భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ కమిష నర్: జగ్జీవన్



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/ఆగస్టు 12/అక్షరం న్యూస్: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో ఉన్న గ ర్ల్స్ హాస్టల్, పరిసర ప్రాంతాల్లో చేపడుతున్న పారిశు ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ జె. జగ్జీవన్ వార్డు కౌ న్సిలర్ సయ్యద్ గఫార్ తో కలిసి బుధవారం పరిశీలిం చారు. హాస్టల్ పరిసర ప్రాంతాలలో పిచ్చి మొక్కలు, పొ దలు పేరుకుపోవడంతో మున్సిపల్ సిబ్బంది ద్వారా వా టిని తొలగించే పనులు చేపట్టారు. పరిసరాల్లో చెత్తాచె దారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, మురుగు కాలువల్లో పూడిక తొలగించి నీరుసజావుగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సిబ్బం దికి సూచించారు.వర్షాకాలాన్ని దృష్టిలోఉంచుకొని నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి వెంటనే శుభ్రపరచాల ని, దోమల వృద్ధికి అవకాశం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు.ముఖ్యంగాగర్ల్స్ హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి విద్యార్థినులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని సూచించా రు.మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం, దోమల నివార ణ, ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తూని రం తరం చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపా రు. ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉం డకుండా జాగ్రత్తలు తీసుకొని మున్సిపల్ సిబ్బందికి స హకరించాలని కోరారు.

## సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయండి

**•సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న**



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) ఆగస్టు 12: కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న పిలుపునిచ్చారు. బుధవారం సిపిఐ పార్టీ జన చైతన్య యాత్రలో భాగంగా రఘునాథపల్లి మండల కేంద్రంతో పాటు కంచనపల్లి బాణాజీ పేట,నారాయణపురం గ్రామాలలో చేపట్టిన పాదయాత్ర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు ఏ.శ్రీనివాస్, పాతూరు సుగుణమ్మ,జిల్లా కార్యవర్గ సభ్యులు కావటి యాదగిరి,సిపిఐ మండల సహాయ కారదర్శి కందుకూరి మల్లేశం,గుండే సుధాకర్, ముప్పిడి ఎల్లయ్య, అశోక్, సుద్దాల శ్రీకాంత్,కందుకూరి శోభన్ బాబు, ఇమ్మానుయేల్, శ్రీశైలం,అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులుచే రఘునాథపల్లిలో ఘనంగా తిరంగా ర్యాలీ



జనగామ జిల్లా/రఘునాధపల్లి/( అక్షరం న్యూస్)ఆగస్టు 12: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశ ప్రజలలో దేశ భక్తితో పాటు జాతీయ సమైఖ్యతను పెంపొందించేందుకు ప్రతీ ఒక్కరు తమ ఇంటిపై జాతీయ జెం డాను ఎగురవేసి దేశ భక్తిని చాటుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్ అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్ అల్ఫొన్సెస్ హైస్కూల్ నుండి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు బీజేపీ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో సుమారు 150 అడుగుల పొడవుగల భారీ మూడు రంగుల జాతీయ పతాకంను చేతబూని ఉత్సాహపూరిత వాతావరణంలో బుధవారం ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు వందేమాతరం గీతాన్ని అలపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కావటి ముత్యాలు, కల్పగూరి ప్రభాకర్, సాయి విజయ్ భాస్కర్ రెడ్డి, ఆకుల రామచంద్రం. తిరుమల్ ప్రసాద్, మర్కాల వెంకట రెడ్డి, లెక్కల దామోదర్ రెడ్డి, తుమ్మలపల్లి సోవే శ్వర్, ఉడుత రంజిత్, నల్ల వాసుదేవ రెడ్డి, రాజు, వెంకటేష్, కిషన్, అఖిల్, సుధాకర్, గుర్రం జంపి, నేతావత్ సురేష్, రాజేష్, నల్ల యాకుబ్ రెడ్డి, ఉడుత కనకయ్య. సెయింట్ అల్ఫొన్సెస్, సెయింట్ మేరీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు

## మృతుల కుటుంబాలకు దళిత బహుజన సంఘాల నాయకుల పరామర్శ.





హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ఆగస్టు 12/అక్షరం న్యూస్:-

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముత్తారం, ముల్కనూరు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను దళిత బహుజన ప్రజా సంఘాల నాయకులు బుధవారం పరామర్శించారు. ముత్తారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రేణుకుంట్ల శాంతికుమార్ తండ్రి రేణుకుంట్ల జాన్ నాలుగు రోజుల క్రితం మృతి చెందారు. విషయం తెలుసుకున్న నాయకులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి. ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించి మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అదేవిధంగా ముల్కనూరు గ్రామానికి చెందిన ఎన్టీవీ రిపోర్టర్ కోల రమేష్ తండ్రి కోల వెంకటాద్రి ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని కూడా నాయకులు పరామర్శించారు. రమేష్‌తో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి తమ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి మండల జేఏసీ చైర్మన్ డ్యాగల సారయ్య, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి, పీపుల్స్ డైరీ రాష్ట్ర కోఆర్డినేటర్ కండె రమేష్, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కండె సుధాకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు రేణిగుంట్ల బిక్షపతి, జనగాని సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# బోర్లం సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ





మద్నూర్ / ఆగస్టు 12 ( అక్షరం న్యూస్ - కామారెడ్డి

బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు, జూనియర్ కళాశాల (బాలికల)ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకులంలో విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతులు, భోజనం, పరిశుభ్రత తదితర అంశాలను వారు పరిశీలించారు.

### విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్, ఎస్పీ

గురుకుల తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థినులతో ఒకే చోట కూర్చొని భోజనం చేస్తూ, వారికి అందిస్తున్న ఆహారం నాణ్యత, రుచి, మెనూ అమలు, పరిశుభ్రతపై స్వయంగా తెలుసుకున్నారు. భోజనం ఎలా ఉందని విద్యార్థినులను అడిగి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందేలా చూడాలని, భోజన తయారీ ప్రదేశం, వంట సామగ్రి, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు.

### తరగతి గదులు, రికార్డుల పరిశీలన

కళాశాలలోని తరగతి గదులను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి చదువులు, విద్యా ప్రగతి, కళాశాలలో అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లో బోధనా విధానం, బ్లాక్‌బోర్డుపై రాసిన పాఠాలు, విద్యార్థుల విద్యా ప్రగతి, కళాశాల రికార్డులు, నివేదికలు, విద్యార్థులు సాధించిన ట్రోఫీలను పరిశీలించారు. అధ్యాపకులతో విద్యార్థుల విద్యా ప్రగతి, బోధనా పద్ధతులు, పరీక్షల ఫలితాలపై చర్చించారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి, ఉన్నత విద్యకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు.

### మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

కళాశాల ఆవరణ, విద్యార్థినుల వసతి సౌకర్యాలు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుకునేలా అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం, పోషకాహారం, మెరుగైన వసతులు అందించడం అధికారుల బాధ్యత అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డీఓ రవీందర్ రెడ్డి, డీసీఓ, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, గిర్దావర్, జీపీఓ, పంచాయతీ కార్యదర్శి తదితర అధికారులు పాల్గొన్నారూ.



# ప్రభుత్వ కాలేజీలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య : కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్




మద్నూర్ /ఆగస్టు 12 (అక్షరం న్యూస్ - కామారెడ్డి )

బాన్స్వాడ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణతో, ప్రణాళికాబద్ధంగా చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పిలుపునిచ్చారు. బుధవారం బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్మీడియట్ అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమంతో పాటు విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక శిక్షణ బృందం ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ అధ్యాపకులకు బోధనా నైపుణ్యాలు, ఆధునిక బోధనా పద్ధతులపై శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ ద్వారా పొందిన జ్ఞానం, నైపుణ్యాలను అధ్యాపకులు తరగతి గదుల్లో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను గుర్తించి, వారి స్థాయికి అనుగుణంగా బోధనా విధానాలను అవలంబించాలని అధ్యాపకులకు సూచించారు. ఆధునిక బోధనా పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థుల్లో ఆసక్తి, సృజనాత్మకత పెంపొందేలా బోధన కొనసాగించాలని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను అందిస్తున్నందున వాటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించాలని అన్నారు. ప్రతి విద్యార్థి తనకు ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పరచుకుని, దానిని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. ఉన్నత విద్య, పోటీ పరీక్షల్లో రాణించేలా అధ్యాపకులు విద్యార్థులకు నిరంతరం మార్గనిర్దేశం చేయాలని పేర్కొన్నారు. ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను జిల్లా కలెక్టర్ అభినందించారు. విద్యార్థులు అధ్యాపకులు అందిస్తున్న బోధన, మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి తమ లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు పర్యావరణ పరిరక్షణపై కూడా విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కను నాటారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సలామ్, హైదరాబాద్ నుంచి వచ్చిన శిక్షణ బృందం సభ్యులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరూ పింఛన్లకు దరఖాస్తులు చేసుకోండి..

**•బితహసీల్దార్ బి. బాల కిషన్**



మహబూబాబాద్ జిల్లా/ గంగారం/ ఆగష్టు 12(అక్షరం న్యూస్ ) గంగారం మండలం

తెలంగాణ రాష్ట్రంలో 'చేయూత' పథకం కింద కొత్త పింఛన్ల మంజూరుకు ఈ నెల 15 నుంచి మండలం లోని ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని గంగారం తహసీల్దార్ బి బాలకిషన్ తెలిపారు. మండలంలో ఉన్న ఒంటరి మహిళలు, వితంతువులు, గీత, చేనేత కార్మికులు, వికలాంగులు, దయాలసిస్ బాధితులు, థాలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా బాధితులకు పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. గ్రామాలలో లొ ఏటా 1.50 లక్షలు, పట్టణాల్లో 2 లక్షల లోపు ఆదాయం ఉన్నవారు అర్హులని, 3 ఎకరాల మెట్ట,5 ఎకరాల మాగాణి లోపు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నేల 31 వరకు చివరి తేదీ అని, దరఖాస్తుదారులు తమ దరఖాస్తులను స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమర్పించాలని తెలిపారు. అనంతరం సెప్టెంబర్ ఒకటి తేదీ నుండి దరఖాస్తులను పరిశీలించి, అర్హులను గుర్తించి సంబంధిత జిల్లా అధికారులకు సమర్పిస్తామని వారు తెలిపారు,

# ముల్కనూరులో అదృశ్యమైన వృద్ధురాలు మృతి



భీమదేవరపల్లి/ఆగస్టు 12/అక్షరం న్యూస్:-
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామానికి చెందిన మద్ది నర్సమ్మ (65) అదృశ్యమైన రెండు రోజుల అనంతరం అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 9న నర్సమ్మ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు ఇరుగుపొరుగు వారిని విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె కుమారుడు మద్ది అజయ్ ఈ నెల 10న పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం ముల్కనూరు ఎంపీఆర్బీ బ్యాంకు వెనక ఉన్న చెట్ల పొదల్లో ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు గ్రామస్తులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. మృతదేహం అదృశ్యమైన మద్ది నర్సమ్మదేనని గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకున్నారు. మృతదేహం పక్కన పురుగుల మందు డబ్బా లభించడంతో ఆమె పురుగుల మందు తాగి మృతిచెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

# పీకే రామయ్య కాలనీలో వైభవంగా తీజ్ నిమజ్జన కార్యక్రమం





జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 12 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్
: పీకే రామయ్య కాలనీలో శ్రీ సేవాలాల్ యూత్ అండ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ ఉత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం సాయంత్రం ఘనంగా జరిగింది. తీజ్ నిమజ్జన కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు.
బంజారా సమాజానికి తీజ్ పండుగ ఎంతో ప్రత్యేకమైనది. ప్రకృతి పచ్చదనం, పంటల సమృద్ధి, కుటుంబ సౌభాగ్యం, మహిళల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ ఈ పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. యువతులు, మహిళలు తీజ్ మొలకలను ప్రత్యేకంగా పెంచి, పూజలు నిర్వహిస్తూ సంప్రదాయ పాటలు, నృత్యాలతో ఉత్సవాలను కొనసాగిస్తారు. పండుగ ముగింపు సందర్భంగా తీజ్ మొలకలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోంది.
పీకే రామయ్య కాలనీలో జరిగిన తీజ్ వేడుకల్లో మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి పాటలు, నృత్యాలతో సందడి చేశారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను ప్రతిబింబించేలా ఉత్సవాలు కొనసాగాయి. అనంతరం తీజ్ మొలకలను నిమజ్జనం చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు, యువత, స్థానికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ మాట్లాడుతూ బంజారా సమాజ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తీజ్ వంటి పండుగలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు మహిళలు, యువతలో సాంస్కృతిక చైతన్యాన్ని పెంచుతాయని పేర్కొన్నారు.
శ్రీ సేవాలాల్ యూత్ అండ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ బంజారా సంప్రదాయాలను ప్రజలకు పరిచయం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మహిళలు, యువత, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### సమావేశ ఆజీవిక యోజన పథకం అమలు, ఎంపీడీవో కార్యాలయం, పెన్షన్, వివరాలు రికార్డులు,కేజీబివి పాఠశాల ఆకస్మిక తనిఖీ చేసిన బిజిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

మహబూబాబాద్ జిల్లా/ గంగారం/ ఆగస్టు 12(అక్షరం న్యూస్ ) గంగారం మండలం లోని సమావేశ ఆజీవిక యోజనా పథకం అమలు

**విత్తనాల పంపిణీ:**

సమావేశక ఆజీవిక యోజనా పథకం అమలు తీరును పరిశీలించిన కలెక్టర్ రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో 10 రకాల కూరగాయల విత్తనాల (సీడ్స్) కిట్లను (752) మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని నాణ్యమైన పంటలు పండించాలని సూచించారు. సీడ్స్ వేసిన విధానం స్వయంగా పరిశీలించి వారి యొక్క ఆర్థిక సామాజిక స్థితిగతులను స్వయంగా పరిశీలించి వారితో మాట్లాడారుస్థానిక రైతుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఉ=ఖూ (డిఆర్డిఏ) ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో వేగవంతంగా జరుగుతున్న 'ఫార్మ్ పాండ్' (రైతు కుంటలు) పనులను తనిఖీ చేసి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**పింఛన్ల పరిశీలన:**

మండల పరిధిలో అర్హులైన వివిధ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు అందుతున్న పింఛన్ల పంపిణీ, తదితర అంశాలను తీరును పరిశీలించి, ఏ ఒక్క అర్హుడికి సంక్షేమ పథకాలు దూరం కాకూడదని స్పష్టం చేశారు.

**కేజీబీవీ (ఖ+దీఎ) పాఠశాల తనిఖీ:**

కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) అకస్మాత్తుగా తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థినులకు అందుతున్న విద్యాబోధన, భోజన వసతి, మరియు పరిశుభ్ర పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. విద్యార్థినుల భద్రత, ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు,
ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, ప్రత్యేక అధికారి వెంకటరమణ, ఉద్యానవన శాఖ అధికారి జి.మరియన్న ఎమ్మార్వో బాలకృష్ణ, ఎంపీడీవో వైష్ణవి, ఆస్పిరేషనల్ బ్లాక్ అధికారి శ్రీనాథ్, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు

# ఆధునిక సాగు పద్ధతులతో అధిక దిగుబడులు





**జిల్లాకలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)ఆగస్టు 12: తక్కువ నీటితో ఆధునిక సాగు పద్ధతుల ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించడం సాధ్యమవుతుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మండలంలోని కోమల్ల గ్రామంలో మంద రాములు అనే రైతు రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో బహుళ అంతస్తుల వ్యవసాయ విధానంలో వివిధ రకాల పంటలను సాగు చేసిన వ్యవసాయ క్షేత్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం సందర్శించి పంటలను పరిశీలించారు. రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో మునగ, సపోటా, నిమ్మ, అంజీర్, సీతాఫలం, అరటి తదితర ఉద్యాన పంటలతో పాటు బీర, సొరకాయ తదితర కూరగాయల పంటలను సైతం సాగు చేశాడు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ పంటల సాగుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఏమైనా సబ్సిడీ, ప్రోత్సాహకాలు అందయా.. సాగు కోసం ఖర్చు చేసిన పెట్టుబడి ఎం త..పంటల నిర్వహణకు ఎంత ఖర్చు అవుతుంది.. తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. అలాగే వ్యవసాయ క్షేత్రానికి ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ సదుపాయం గురించి తెలుసుకొని, పంటలకు అవసరమైన నీటిని పొదుపుగా వి నియోగిస్తూ...ప్రతి మొక్కకు తగిన మోతాదులో నీరు అందేలా డ్రిప్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించాలని సూచిం చారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగు చేసేలా ఆధునిక సాగు పద్ధతులను రైతులు విస్తృతంగా వి నియోగించుకోవాలన్నారు. బీరకాయ, కాకర, సొరకాయ, పొట్లకాయ వంటి తీగ జాతి కూరగాయల పంటలకు పందిర్లు ఏర్పాటు చేయడం ద్వారా మొక్కల పెరుగుదల మెరుగుపడి పంట నాణ్యత పెరగడంతో పాటు పురుగులు, తెగుళ్ల ప్రభావాన్ని నియంత్రించవచ్చని అన్నారు. రైతులకు అవసరమైన పందిర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలను పరిశీలించి అర్హత మేరకు సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. వినూత్న వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తున్న రైతులను గుర్తించి, వారి అనుభవాలను ఇతర రైతులకు తెలియజేసే కార్యక్రమాలను చేపట్టాలని అధికార లకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోనీ, డీఆర్డీవో భాస్కర్, కేవికే శాస్త్రవేత్త రమ్య, జిల్లా అధికారి నరసయ్య, ఏడి సందీప్, హెచ్ ఈ ఓ అనిల్, స్టేషన్ ఘనాపూర్ ఏడి అపర్ణ, వ్యవసాయ అధికారి కరుణాకర్, ఏ ఈ ఓ కల్పనా తదితరులు పాల్గొన్నారు

### జమ్మికుంట తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించిన ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ



కరీంనగర్/ జమ్మికుంట/ ఆగస్టు 12/ అక్షరం న్యూస్:
విద్యారంగ , ఉపాధ్యాయ రంగ సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ( యూఎస్ పిసి) పిలుపుమేరకు రెండవ దశ నిరసన కార్యక్రమములో భాగంగా బుధవారం రోజున మధ్యాహ్నం భోజన విరామ సమయంలో జమ్మికుంట మండల తహసీల్దార్ కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ రంగానికి చెందిన అనేక సమస్యలు పెండింగ్లో ఉన్నాయని ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని లేకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయులను కూడగట్టి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పి ఆర్ సి కమిషన్ రిపోర్ట్ వెంటనే తెప్పించుకొని అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న డి ఏ లను విడుదల చేయాలని, జీవో 25ని సవరించి ప్రాథమిక పాఠశాలలో తరగతికో ఉపాధ్యాయుని నియమించాలని డిమాండ్ చేశారు. టి పి టి ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అవినాష్ మాట్లాడుతూ. సి పి ఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిటిఎఫ్ మండల అధ్యక్షులు వేణుమాధవ్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టబోయే వర్క్ అడ్జస్ట్మెంట్ ఎలాంటి పైరవీలకు తావివ్వకుండా పారదర్శకంగా జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట టి పి టి ఎఫ్ ప్రధాన కార్యదర్శి కుమారస్వామి డిటిఎఫ్ జమ్మికుంట మండల ప్రధాన కార్యదర్శి కె. సంపత్, డిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం సదానందం, డిటిఎఫ్ సీనియర్ నాయకులు ఎం శ్రీనివాస్, పి.రాజు, పి విజేందర్ రెడ్డి ,హరీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సిబ్బందిపై దాడి కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు

రూ.2 వేల జరిమానా విధించిన ప్రిన్సిపల్ జేఎంఎఫ్సీ న్యాయస్థానం
జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 12 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్
: విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ శాఖ సిబ్బందిపై ఇటుకరాయితో దాడి చేసి గాయపరిచిన కేసులో నిందితుడికి గోదావరిఖని న్యాయస్థానం ఆరు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించింది. ఈ మేరకు ప్రిన్సిపల్ జేఎంఎఫ్సీ వెంకట సునీల్‌రెడ్డి బుధవారం తీర్పు వెలువరించారు.
పోలీసుల వివరాల ప్రకారం.. 2018లో ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్యాపూర్ గ్రామంలో విద్యుత్ బిల్లుల వసూలు కోసం విధులు నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బందిపై బరిగెల వెంకటేష్ దాడికి పాల్పడ్డాడు. ఇటుకరాయితో దాడి చేయడంతో సిబ్బందికి గాయాలయ్యాయి. ఘటనపై ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు దర్యాప్తును అప్పటి ఎస్సైలు పి.చంద్రకుమార్, టి.శంకరయ్య సమర్థవంతంగా నిర్వహించి, నిందితుడి నేరాన్ని రుజువు చేసే కీలక సాక్ష్యాధారాలను సేకరించారు. అనంతరం రామగుండం సీఐ కృష్ణకుమార్, ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో సాక్ష్యాధారాలను న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున సహాయ ప్రభుత్వ న్యాయవాది నహీదా పర్వీన్ సమర్థవంతమైన వాదనలు వినిపించారు. కేసులో సమర్పించిన సాక్ష్యాధారాలను, వాదనలను పరిశీలించిన ప్రిన్సిపల్ జేఎంఎఫ్సీ వెంకట సునీల్‌రెడ్డి నిందితుడు బరిగెల వెంకటేష్‌ను దోషిగా నిర్ధారించారు. అతడికి ఆరు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. నిందితుడికి శిక్ష పడేలా దర్యాప్తు నుంచి న్యాయస్థాన విచారణ వరకు సమన్వయంతో పనిచేసిన కోర్టు కానిస్టేబుల్ బి.శ్రీనివాస్, హోంగార్డ్ పి.శ్రీనివాస్, లైజన్ అధికారి ఎన్.శంకర్‌లను పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

### అద్దె వాహనానికి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ /హుజురాబాద్/ ఆగస్టు 12 /అక్షరం న్యూస్:
సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకాధికారి, ఐసీడీఎస్, హుజురాబాద్ ప్రాజెక్టు కార్యాలయానికి అద్దెప్రాధిపదికన వాహనం సమకూర్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఓ సుగుణ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుతో పాటు వాహనం, డ్రైవర్ కు సంబంధించిన అన్నిప్రతులు జత చేసి సీల్డ్ కవర్లో దరఖాస్తులు ఈనెల 15 సాయంత్రం 5 గంటలలోపు హుజురాబాద్ కేసీ క్యాంపులో గల సిడిపిఓ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

### విద్యుత్ షాక్ తో రెండు గొర్రెల మృతి

- **ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వేడుకోలు**



కరీంనగర్/ జమ్మికుంట/ ఆగస్టు 12/అక్షరం న్యూస్:
జమ్మికుంట మండలంలోని మాచనపల్లి గ్రామానికి చెందిన పులవేన కొమరయ్య తండ్రి రాజయ్య కు చెందిన రెండు గొర్రెలు ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతకానికి గురై మృత్యువాత పడ్డాయి. నిరుపేద కుటుంబానికి చెందిన కొమురయ్య జీవనోపాధికి గొర్రెలను కాసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లకు తగిలి 2 గొర్రెలు మృతి చెందాయి. సుమారు 30 వేల రూపాయల నష్టం వాటిందని కొమురయ్య వాపోయారు.ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కొమురయ్య ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

## మహిళా బిల్లు ముద్దు..డీలిమిటేషన్ వద్దు

- ప్రస్తుత సంఖ్య ఆధారంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు
- తమిళనాడు అసెంబ్లీలో సిఎం విజయ్ తీర్మానం



చెన్నై,ఆగస్ట్12 అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా తమిళనాడు ప్రభుత్వం వరుస తీర్మానాలను ప్రవేశపెడుతోంది. మొన్న రాష్ట్రగీతం, నిన్న నీట్.. నేడు డీలిమిటేషన్‌పై తీర్మానాలను తీసుకువచ్చింది.లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన డీలిమిటేషన్ కు వ్యతిరేకంగా తమిళనాడు సీఎం విజయ్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. డీలిమిటేషన్‌కు తాము అంగీకరించేదే లేదని స్పష్టం చేశారు. జనాభా నియంత్రణకు అనేక చర్యలు తీసుకున్న తమిళనాడుకు డీలిమిటేషన్‌తో నష్టం జరుగు తుందని అన్నారు. జనాభా ఆధారంగా నియోజకవర్గ పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలన్నిటికీ నష్టమని చెప్పారు. ఈ తీర్మానంలో సీఎం విజయ్ మొత్తం మూడు డిమాండ్స్‌ను కేంద్రం ముందుంచారు. లోక్‌సభ సీట్ల సంఖ్యను ఎప్పటికీ 543 వద్ద స్తంభింపజేయాలని అన్నారు. రాష్ట్రాలకు ప్రస్తుతమున్న ఎంపీ సీట్ల సంఖ్యను శాశ్వతం చేయాలని అన్నారు. రాష్ట్రాల అసెంబ్లీల్లో కూడా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తీసుకురావాలని అన్నారు. నియోజకర్గాల పునర్ వ్యవస్థీకరణ (ఆ÷తిపతిబిజీబితినీని) కోసం కేంద్రం తీసుకువచ్చిన బిల్లును వ్యతిరేకించింది. అదే సమయంలో మహిళా రిజర్వేషన్‌కు మద్దతు ఇచ్చింది. ప్రస్తుతమున్న 543 సీట్లతోనే దానిని అమలు చేయాలని విజయ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేశాయని ఈ సందర్భంగా సీఎం విజయ్ అన్నారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే నష్టం వాటిల్లొచ్చని హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలను అలాగే కొనసాగించాలి. ప్రతి రాష్ట్రానికి ప్రస్తుతం కేటాయించిన స్థానాలను శాశ్వతం చేయాలి. రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్రం ముందు మూడు డిమాండ్లు ఉంచారు. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లను 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందే కల్పించడానికి పార్లమెంటు ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రయత్నిస్తోంది. 543 లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించి 816కి పెంచే ప్రతిపాదనపైనా అడుగు ముందుకు వేయాలని చూస్తోంది. ఈ సమయంలో తమిళనాడు ప్రభుత్వం తీర్మానాన్ని ప్రవేశపెట్టడం గమనార్హం. ఇటీవల పశ్చిమబెంగాల్, మహారాష్ట్రల్లో రాజకీయ సమీకరణాల మార్పులతో ఎన్డీయే బలం మరింత పెరిగిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. దీంతో, కేంద్రం డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లును తెచ్చేందుకు మరోసారి ప్రయత్నిస్తుందన్న వార్తలు వచ్చాయి. అయితే, డీలిమిటేషన్‌ను దక్షిణాది రాష్ట్రాలు మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తమిళనాడు సీఎం విజయ్ ప్రవేశపెట్టిన తీర్మానం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

## జైలులో మాజీ ఎంపి రేవణ్ణ విలాసాలు

**సెల్‌ఫోన్‌తో పాటు, పెన్ డ్రైవ్ పట్టుకున్న అధికారులు**



బెంగళూరు,ఆగస్ట్12 అత్యాచారం కేసులో దోషిగా తేలి జైలు శిక్ష అనుభవిస్తున్న మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ వద్ద సెల్ ఫోన్‌తోపాటు పెన్ డ్రైవ్ లభ్యమైనాయని సెంట్రల్ క్రైమ్ అధికారులు వెల్లడించారు. అతడి వద్ద నుంచి నీలి రంగు ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్, పెన్ డ్రైవ్, ఛార్జర్‌తోపాటు డైరీని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. బెంగళూరు లోని పరప్పరన అగ్రహారం సెంట్రల్ జైలులో తమ బృందం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించిందని చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ అధికారులు తెలిపారు. మరో వైపు ఈ వ్యవహారంపై ప్రభుత్వం సీరియస్ అయింది. రేవణ్ణకు ఆ వస్తువులు ఎలా అందాయనే అంశంపై పూర్తి విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. జైలు అధికారులపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా జైలు అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఈరన్న రంగాపూర్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. జైలులో లోపాలపై వివరణ ఇవ్వాలంటూ జైలు సూపరింటెండెంట్ అనుష్క కుమార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసింది. సెంట్రల్ జైలులో దాదాపు ఐదు గంటల పాటు సోదాలు జరిగాయని జైళ్ల శాఖ డీజీపీ అలోక్ కుమార్ తెలిపారు. ఈ తనిఖీల్లో ప్రతాప్ రాయ్ అనే మరో ఖైదీ వద్ద కూడా మొబైల్ ఫోన్ లభ్యమైందని అన్నారు. 019లో హసన్ ఎంపీ, జేడీ (ఎస్) నేత ప్రజ్వల్ రేవణ్ణ తనపై లైంగిక దాడికి పాల్పడ్డారంటూ హోలినరసిపుర రూపల్ పోలీస్ స్టేషన్‌లో ఓ మహిళ ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంలో విచారణ జరిపిన బెంగళూరులోని ప్రత్యేక కోర్టు అతడిని దోషిగా తేల్చింది. అతడికి జీవిత ఖైదు విధించింది. అలాగే రూ. 10 లక్షల జరిమానా విధించింది. 2025, ఆగస్టు 2వ తేదీన కోర్టు ఈ మేరకు తీర్పు వెలువరించింది. తనపై అతడు అత్యాచారం చేయడమే కాకుండా.. వీడియో కూడా తీశారంటూ బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

## తిరుమలకు వచ్చే విదేశీ భక్తులకు ప్రభుత్వం శుభవార్త

**రేణిగుంట విమానాశ్రయంలో ఈ వీసా సేవలు**

తిరుపతి,ఆగస్ట్12 తిరుమలలో కొలువుదీరిన కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి వారి దర్శనం కోసం వచ్చే విదేశీ భక్తులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. తిరుపతి సమీపంలోని రేణిగుంట విమానాశ్రయంలో ఈ – వీసా సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. గతంలో తిరుమలలో శ్రీవారి దర్శనం కోసం విదేశీ భక్తులు రావాలంటే.. ముందుగా చెన్నై, బెంగళూరు లేదా హైదరాబాద్ చేరుకోవాల్సి వచ్చేది. అక్కడ ఈ –వీసా పక్రియ పూర్తి చేసుకుని ఆ తర్వాత శ్రీవారి దర్శనం కోసం తిరుపతికి చేరుకునే వారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో తిరుపతి విమానాశ్రయంలో ఈ వీసా సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఇకపై ప్రయాణికులు విదేశాల నుంచి నేరుగా తిరుపతి విమానాశ్రయం చేరుకొని ఈ – వీసా పక్రియ ఇఇఇఇుగించుకునే అవకాశం ఉంటుంది. ప్రయాణానికి కనీసం పది రోజులు ముందే ఆన్‌లైన్‌లో ఈ – వీసాను ప్రయాణికులు అందుకోవాల్సి ఉంటుంది. యితే తిరుపతి విమానాశ్రయంలో అంతర్జాతీయ సర్వీసులు లేనప్పటికీ ముందస్తుగానే ఈ – వీసా కౌంటరును కేంద్ర పౌర విమానయాన శాఖ మంజూరు చేసింది. త్వరలోనే ఈ విమానాశ్రయం నుంచి ఇంటర్నేషనల్ సర్వీసులు ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం.

# డీ లిమిటేషన్‌తో ప్రజలకు ఒరిగేదేమీ లేదు !

హైదరాబాద్, కాలనుగుణంగా నడుచుకోవడం..ప్రజల ఆకాంక్షలను పట్టించుకోవిడం పాలకుల కర్తవ్యం. శ్రీరాముడంతటి వాడు ప్రజల మనసెరిగి పాలన చేశారు. పూర్వం రాజులంతా అలాగే నడుచుకునే వారు. అలా కాకుండా పీడించిన వారు చరిత్రలో కనుమరుగయ్యారు. నిరంకుశంగా పాలించిన వారు సైతం చరిత్ర లేకుండా పోయారు. భారతదేశంలో అనేకానేక సమస్యలు ఇప్పుడు వస్తున్నాయి. వాటిని పట్టించుకోవడం మానేసిన అధికార, విపక్ష సభ్యులు తమ మానాన తాము సాగుతున్నారు. ఈ మధ్యకాలంలో పార్లమెంట్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలేవీ పెద్దగా చర్చించడం లేదు. పాలకులు అనుకున్నది మాత్రమే చట్టంగా మారుతోంది. దానిపైనా చర్చలు లేవు. విపక్షాలు కూడా గందరగోళం సృష్టించి బయపటడడం ద్వారా రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నాయి. ఈ క్రమంలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నీరుగారి పోయాయి. ఎవరి పట్టు వారు పట్టడంతో రోజూ సభలను వాయిదా వేయడం మినహా ముందుకు కదలడం లేదు. జంతర్‌మంతర్ ఘటనకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా వచ్చి క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేయడంతో పార్లమెంటు ఉభయ సభలు ఈ వర్షాకాల సమావేశాల్లో సజావుగా జరగడమే లేదు. మరో వైపు పార్లమెంటులో విపక్షాల నినాదాలు, పోడియంలోకి దూసుకుని రావడం, స్పీకర్ ఓంబిర్లా వారించడం నిత్యకృత్యంగా మారాయి. దీంతో సమావేశాలను విపక్ష పార్టీలు కావాలనే స్తంభింపచేస్తున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే అధికార పార్టీ సభ్యులు కూడా మకరద్వారం వద్ద ప్రతిపక్షాలను నిలదీస్తూ 'రాహుల్ గాంధీ జవాబ్ దో..' అని నినాదాలు చేశారు. ఇండియా కూటమి భాగస్వామి జార్ఖండ్ ముక్తి మోర్చా అధికారంలో ఉన్న జార్ఖండ్‌లో విద్యార్థులపై జరిగిన లాఠీ ఛార్జీతో అధికార పార్టీ సభ్యులకు అవకాశం లభించింది. అందుకే జార్ఖండ్‌పై జవాబ్‌దో అంటూ ఎదురుదాడికి దిగారు. అయితే ఇవేవీ ప్రజలకు ఉపయోగపడే వ్యవహారాలు కావు. అటు అధికార పార్టీ, ఇటు విపక్ష పార్టీలు రెండూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయనడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదు. నినాదాలు చేస్తున్న పాలక,



ప్రతిపక్ష సభ్యుల తీరును పత్రికలు, ఛానళ్లు కవర్ చేస్తూ...తమవంతు బాధ్యతను నిర్వహి స్తున్నాయి. నిజానికి వర్షాకాల సమావేశాల్లో ఏవో అద్భుతాలు జరుగుతాయనుకున్నారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లు, ఎఫ్‌సీఆర్‌ఐ బిల్లు, వికసిత్ భారత్ శిక్షా అనుసంధాన్ బిల్లు మొదలైన వాటిని ఆమోదం పొందేలా మోడీ వ్యూహం సిద్దం చేసుకున్నారని అంతా భావించారు. నిజానికి ఈ బిల్లులను ఆమోదింపచేసేందుకు నరేంద్రమోదీ బృందం రంగం సిద్ధం చేసింది. బెంగాల్‌లో విజయం తర్వాత రెట్టించిన ఉత్సాహంతో తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది ఎంపీలను చీల్చి ఒక అనామక పార్టీలో చేరేలా చేశారు. ఉద్ధవ్ ఠాక్రేకు చెందిన శివసేన ఎంపీలను తమ వైపుకు లాగారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులను బీజేపీ వైపునకు తిప్పుకున్నారు. తమిళనాడులో విజయ్ పార్టీకి కాంగ్రెస్ మద్దతునిచ్చిన తర్వాత ఇండియా కూటమినుంచి వైదొలగిన డీఎంకేతో బేరసారాలు ఆడారు. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీతో కూడా మంతనాలు జరిపారు. ఏ పార్టీనైనా ఎప్పుడైనా చీల్చగల, ఎవరినైనా దెబ్బతీయగల నరేంద్రమోదీ ఏదైనా సాధించగలరని ఎన్‌డిఎ మద్దతుదారులంతా భావించారు. కానీ ఇలా తలకిందులు అవుతుదని వారు కూడా భావించి ఉండరు. బహుశా మోడీ కూడా ఇలా జరుగుతుందని ఊహించి ఉండరు. అంతా తాను అనుకున్నట్లుగా సజావుగా సాగిపోతుందని అనుకుని ఉంటారు. నిజానికి పార్లమెంట్ ప్రారంభం రోజే మోడీ సభకు హాజరై ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. కాక్రోచ్ పార్టీ ఉద్యమంతో అంతా తలకిందులయ్యింది. ముఖ్యంగా కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావం, విద్యార్థుల ఆందోళన, మోదీని అవహేళన చేయడం, ఆయన ప్రతి చర్యనూ ప్రశ్నించడం వంటివన్నీ మోదీ నాయకత్వాన్ని నిలదీస్తూ వచ్చాయి. ఆందోళన ఫలితంగా కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి రావడం కూడా ఓ రకంగా ఎదురుదెబ్బగానే భావించాలి. ఢిల్లీలో విద్యార్థుల నిరసన దేశ వ్యాప్తంగా అనేక నగరాల్లో ప్రకంపనలు సృష్టించడంతో బీజేపీ, సంఘ్‌ను పునరాలోచనలో పడేలా చేశాయనడంలో సందేహం లేదు. ఇప్పుడు దాని ప్రభావంతోనే జార్ఖండ్‌లోనూ ప్రకంపనలు సృష్టిస్తోంది. అయితే దీనివెనక ఎవరి హస్తం ఉందన్న ఆరా తీస్తూనే ఉన్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే పాలకులు ప్రజల మనసెరిగి ప్రవర్తించాలి. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా సాగాలి. ఇప్పటికైనా విద్యార్థుల ఆందోళనలను సానుకూల దృక్పంథంతో పరిశీలిస్తే, సమస్యను పరిష్కరిస్తే మంచిది. ఇదొక్కటే కాదు.. అనేక సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలి. నిరుద్యోగం, వైద్యరంగం, అధిక ధరలు, వంటివాటిని యుద్ధప్రాతిపదిక పరిష్కరించాలి. డీ లిమిటేషన్ ప్రజలకు అవసరం లేని వ్యవహారం. ఇది కేవలం రాజకీయ పార్టీలకు సంబంధించినదే కనుక దీనిని పక్కన పెట్టడం మంచిది. మహిళా బిల్లును ప్రస్తు పార్లమెంట్ సభ్యుల సంఖ్యకే పరిమితం చేయడం మంచిది. ఎంపిలు పెరిగితే ఆర్థిక భారం తప్ప ప్రజలకు ఒరిగేదేమీ లేదు. ఈ దిశగా కృషి చేయకుంటే మోడీ సర్కార్‌కు కష్టాలు తప్పవు. దేశంలో పెరుగుతన్న నిరుద్యోగ సమస్యలతో పాటు, అధిక ధరలు, దోపిడీలు, సైబర్ మోసాలు వంటివన్నీ పరిస్కరించదగ్గ సమస్యలే. కనుక వీటిపై మోడీ సర్కార్ దృష్టి సారిస్తే ప్రజలు ఆదరిస్తారు.

# నేటినుంచి శ్రావణ మాసం ప్రారంభం

**శుభ కార్యాక్రమాలకు అనువైన మాసం**

**అనేక పూజాది వ్రతాలకు పవిత్ర మాసం**

యాదగిరిగుట్ట,ఆగస్ట్12 హిందూ సంప్రదాయంలో శ్రావణ మాసం విశిష్టమైనదిగా భావిస్తారు. చాంద్రమానం ప్రకారం.. తెలుగు మాసాల్లో ఐదో మాసం శ్రావణ మాసం. పౌర్ణమి తిథి రోజు చంద్రుడు శ్రవణ నక్షత్రంలో ఉంటాడు కాబట్టి ఈ మాసానికి శ్రావణ మాసం అని పేరు వచ్చింది. అలాగే.. స్థితికారుడైన శ్రీ మహావిష్ణువు జన్మ నక్షత్రం కూడా శ్రావణ నక్షత్రం కాబట్టి శ్రావణ మాసం అని కూడా వచ్చిందని చెబుతారు. ఈ మాసంలో చేసే పూజలు ఎంతో విశిష్టమైనవిగా హిందు ఆచారాన్ని పాటించే వారి నమ్మకం.

దేవతలకు అత్యంత ప్రీతికరమైన మాసం శ్రావణ మాసం. లక్ష్మీదేవి ఎంతో ఇష్టమైన ఈ మాసంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం దీపారాధన చేయడం వల్ల దీర్ఘసుమంగళీ ప్రాప్తంతో పాటు అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని పురాణోక్తి.. తిథులతో కూడా సంబంధం లేకుండా అష్టమి, నవమి, అమావాస్య రోజుల్లో కూడా పూజలు, పండుగలు చేసే మాసం ఈ శ్రావణ మాసం మాత్రమే. అందుకే దీన్ని అత్యంత శుభప్రదమైన మాసంగా భావిస్తారు. ఈ శ్రావణ మాసంలో శివ కేశవులను నిష్టతో, అత్యంత భక్తి శ్రద్దలతో పూజిస్తారు. శ్రావణ సోమవారం, శ్రావణ మంగళవారం, శ్రావణ శుక్రవారం, శ్రావణ శనివారం ఇలా ఈమాసంలో ప్రతి రోజూ విశిష్టతతో కూడుకున్నదే. ఈ మాసంలో చేసే పూజలు విశేషమైన ఫలితాలు ఇస్తాయని నమ్మకం. వివాహాది శుభకార్యాలకు, మంగళ గౌరీ నోములకు, వరలక్ష్మి వ్రతానికి, అన్నాచెల్లెళ్ల బంధాన్ని ముడివేసే రాఖి పౌర్ణమి వంటి పండుగలకు శ్రావణ మాసం పెట్టింది పేరు. తెలుగు పంచాంగం ప్రకారం ఐదో మాసమైన శ్రావణ మాసంలో పండుగలు, వ్రతాలతో పాటు శుభకార్యాలు కూడా ఎక్కువగానే జరుగుతాయి. అందుకే శ్రావణ మాసాన్ని శుభాల మాసమని అంటారు. శుభాల మాసమైన శ్రావణ మాసంలో పౌర్ణమి నాటి చంద్రుడు శ్రవణా నక్షత్రంలో సంచరించడం వల్ల ఈ మాసానికి శ్రావణ మాసమని పేరు వచ్చింది. హిందూ సంప్రదాయం ప్రకారం శ్రావణ మాసంలో ఏ పని చేసినా శుభకరమని భావిస్తారు.



శ్రావణంలో రానున్న పుణ్య తిథులు – పండుగలు ఇలావున్నాయి. ఆగస్టు 13, గురువారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం అవుతుంది. ఆగస్టు 13, గురువారం శ్రావణ శుద్ధ పాడ్యమి: శ్రావణ మాసం ప్రారంభం

గస్టు 14, శుక్రవారం శ్రావణ శుద్ధ విదియ చంద్రోదయం, శ్రావణ మాసం మొదటి శుక్రవారం, ఆండాళ్ తిరు నక్షత్రం, ఆండాళ్ తిరుపురంగా భావిస్తారు. ఆగస్టు 15, శనివారం శ్రావణ శుద్ధ తదియ. శ్రీనివాసుడికి ఇష్టమైన రోజు. ఆగస్టు 16, ఆదివారం, శ్రావణ శుద్ధ చవితి: నాగ చతుర్థి, కశ్యప మహర్షి జయంతి కూడా. ఆగస్టు 17, సోమవారం, శ్రావణ శుద్ధ పంచమి: నాగ పంచమి, గరుడ పంచమి, సింహ సంక్రమణం, శృంగేరి శ్రీ విధుశేఖర భారతీతీర్థ స్వామి వారి జన్మదినం, నారాయణ వనం శ్రీ వీరభద్ర స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయి. ఆగస్టు 18, మంగళవారం శ్రావణ శుద్ధ షష్టి: కల్కి జయంతి. ఆగస్టు 21, శుక్రవారం శ్రావణ శుద్ధ నవమి: శ్రీ వరలక్ష్మి వ్రతం, శ్రీ తరిగొండ వెంగమాంబ వర్ధంతి, తిరుచానూరు శ్రీ పద్మావతి తాయారు అమ్మవారి సన్నిధిలో వరలక్ష్మి వ్రతం వైభవంగా నిర్వహిస్తారు. ఆగస్టు 22, శనివారం శ్రావణ శుద్ధ దశమి: తిరుమల శ్రీవారి పవిత్రోత్సవాలకు అంకురార్పణ జరుగనుంది. ఆగస్టు 23, ఆదివారం శ్రావణ శుద్ధ ఏకాదశి: సర్వ ఏకాదశి, శ్రావణ పుత్రదా ఏకాదశి అని కూడా అంటారు. ఆగస్టు 25, మంగళవారం శ్రావణ శుద్ధ త్రయోదశి: తిరుమల శ్రీవారి పవిత్రోత్సవాలు సమాప్తి, పక్ష ప్రదోషం, భౌమ ప్రదోషం. ఆగస్టు 26, బుధవారం శ్రావణ శుద్ధ చతుర్దశి: ఓనం పండుగ, రుగ్వేదీనాం ఉపాకర్మ, నారాయణ వనం శ్రీ వీరభద్ర స్వామివారి బ్రహ్మోత్సవాలు సమాప్తి కానున్నాయి. ఆగస్టు 28, శుక్రవారం శ్రావణ శుద్ధ పౌర్ణమి: రాఖీపౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి, వైఖానస మహాముని జయంతి, హయగ్రీవ జయంతి, శ్రావణాల పౌర్ణమి, తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి తిరు నక్షత్రం, మృకండ మహర్షి జయంతి కూడా. ఆగస్టు 29, శనివారం శ్రావణ బహుళ పాడ్యమి: గాయత్రీ జపాలకు మంచిది. ఆగస్టు 30, ఆదివారం శ్రావణ బహుళ విదియ: శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధన దినోత్సవం. ఆగస్టు 31, సోమవారం శ్రావణ బహుళ తదియ/ చవితి: పుబ్బ కార్తె ప్రారంభం, సంకష్టహర చవితి కూడా. సెప్టెంబర్ 2, బుధవారం శ్రావణ బహుళ పంచమి/షష్టి: బలరామ జయంతి, తాళ్లపాక శ్రీ సిద్దేశ్వర స్వామివారి పవిత్రోత్సవాలు ప్రారంభం. సెప్టెంబర్ 4, శుక్రవారం శ్రావణ బహుళ అష్టమి: గోకులాష్టమి, శ్రీ కృష్ణాష్టమి, జన్మాష్టమి, తిరుమల శ్రీవారి ఆస్థానం, గోశాలలో గోపూజ, తాళ్లపాక శ్రీ సిద్దేశ్వర స్వామివారి పవిత్రోత్సవాలు సమాప్తం. సెప్టెంబర్ 5, శనివారం శ్రావణ బహుళ నవమి: గురుపూజోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవం. సెప్టెంబర్ 7, సోమవారం శ్రావణ బహుళ ఏకాదశి: సర్వ ఏకాదశి. సెప్టెంబర్ 8, మంగళవారం శ్రావణ బహుళ ద్వాదశి/ త్రయోదశి: పక్ష ప్రదోషం, భౌమ ప్రదోషం. సెప్టెంబర్ 9, బుధవారం శ్రావణ బహుళ చతుర్దశి: మాసశివరాత్రి. సెప్టెంబర్ 11, శుక్రవారం శ్రావణ బహుళ అమావాస్య: పోలాల అమావాస్య ఈ రోజుతో శ్రావణ మాసం సమాప్తమవు తుంది. శ్రావణ మాసంలో రానున్న పండుగలను శాస్త్రంలో సూచించిన విధంగా, పురాణాల ప్రకారం జరుపుకుంటే మంచిది.

# 4న వస్తోన్న క్రైమ్ థ్రిల్లర్ మీర్జాపూర్ మూవీ




భారతీయ ఓటీటీ చరిత్రలో సంచలనం సృష్టించడంతో పాటు అత్యంత ప్రజాదరణ పొందిన క్రైమ్ డ్రామా వెబ్ సిరీస్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై అలరించేందుకు సిద్ధమైంది. అమెజాన్ ఎమ్‌జీఎం స్టూడియోస్ మరియు ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై రితేష్ సిధ్వాని, ఫర్హాన్ అక్తర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్ విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రానికి గుర్‌మీత్ సింగ్ దర్శకత్వం వహిస్తుండగా, సిరీస్‌లో అదరగొట్టిన ప్రధాన నటీనటులందరూ మళ్లీ పెద్ద తెరపై తమ విశ్వరూపం చూపించడానికి వస్తున్నారు. 'సింహాసనం అనేది రాజకీయాల ద్వారా రాదు, అలా అని వంశపారంపర్యంగానూ రాదు? కేవలం బాహుబలం ఉంటేనే సింహాసనం దక్కుతుంది అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో ట్రైలర్ ఆకట్టుకుంటుంది. ఓటీటీలో వెబ్ సిరీస్‌గా ప్రేక్షకులను అలరించిన ఈ నేర ప్రపంచాన్ని, మరింత భారీ హంగులతో, అత్యున్నత నిర్మాణ విలువలతో వెండితెర కోసం మలిచారు. గతంలో సిరీస్‌లో మరణించినట్లు చూపించిన మున్నా భయ్యా (దివ్యేందు) పాత్ర ఈ చిత్రంలో మళ్లీ రీఎంట్రీ ఇస్తుండటం అభిమానులకు అసలైన విందుగా మారనుంది. ఇక మిర్జాపూర్ సింహాసనం కోసం జరిగే పోరులో కాలీన్ భయ్యా (పంకజ్ త్రిపాఠి), గుడ్డూ పండిట్ (అలీ ఫజల్) మరియు మున్నా భయ్యా మధ్య జరిగే రక్తపాతంతో కూడిన పోరాటం ట్రైలర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంలో పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, దివ్యేందులతో పాటు శ్వేతా త్రిపాఠి, రసికా దుగ్గల్, అభిషేక్ బెనర్జీ, జితేంద్ర కుమార్, రవి కిషన్ మరియు పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# గతంలో జరిగిన తప్పులకు క్షమించండి

**డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్‌లో జానీమాస్టర్**



తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్, డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార వేడుకలో ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ చేసిన వ్యాఖ్యలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. గతంలో ఫిల్మ్ ఛాంబర్, ఫెడరేషన్‌తో తలెత్తిన విభేదాలు మరియు వివాదాల పట్ల జానీ మాస్టర్ బహిరంగంగా క్షమాపణలు కోరారు. గత కాలపు పొరపాట్లను పక్కనపెట్టి మళ్లీ ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించుకున్నామని, కొంతకాలం అసోసియేషన్‌కు దూరంగా ఉన్నప్పటికీ మళ్లీ అందరితో కలిసి పనిచేసేందుకు వచ్చానని ఆయన స్పష్టం చేశారు. ఇకపై అందరం ఒకే కుటుంబంలా కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నిర్మాతలు ఇచ్చే పారితోషికాలు డ్యాన్సర్లకు పూర్తిగా అందడం లేదనే తీవ్ర ఆవేదనతోనే గతంలో తాను మాట్లాడాల్సి వచ్చిందని ఆయన వెల్లడించారు. ఇదే అంశంపై మెగాస్టార్ చిరంజీవిని కలిసినప్పుడు, ఆయన ఎంతో సానుకూలంగా స్పందించి సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చినట్లు తెలిపారు. ఆ సమయంలో తన మాటల ద్వారా ఎవరికైనా మనస్తాపం కలిగి ఉంటే, లేదా తెలిసీ తెలియక ఏవైనా పొరపాట్లు జరిగి ఉంటే పెద్ద మనసుతో క్షమించాలని ఇండస్ట్రీ పెద్దలను జానీ మాస్టర్ కోరారు. తండ్రి కోప్పడినా చివరికి పిల్లలను దగ్గరకు తీసుకున్నట్లే, సినీ పరిశ్రమ పెద్దలు మరియు నిర్మాతల మండలి డ్యాన్సర్ల అసోసియేషన్‌ను కలుపుకొని ఆదరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# భారత్-అఫ్గాన్ టీ20 షెడ్యూల్ విడుదల



భారత్, అఫ్ఘానిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య మరో రసవత్తర సమరానికి రంగం సిద్ధమైంది. అఫ్ఘానిస్థాన్ హోస్ట్ చేసే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ఢిల్లీలోని ప్రతిష్ఠాత్మక అరుణ్ జైట్లీ క్రికెట్ స్టేడియం ఆతిథ్యమివ్వనుందని అఫ్ఘానిస్థాన్ క్రికెట్ బోర్డు, బీసీసీఐ సంయుక్తంగా వెల్లడించాయి. సెప్టెంబర్ 13న తొలి టీ20, సెప్టెంబర్ 15న రెండో టీ20, సెప్టెంబర్ 17న మూడో టీ20 మ్యాచ్‌లు ఒకే వేదికపై జరగనున్నాయి. అఫ్ఘానిస్థాన్ తమ స్వదేశీ సిరీస్‌లను భారత్, యూఏఈలలో ఆడుతున్న నేపథ్యంలో, ఈ ద్వైపాక్షిక సిరీస్‌కు భారత్‌నే హోస్ట్ వేదికగా ఎంచుకుంది. అఫ్ఘానిస్థాన్‌లో క్రికెట్ అభివృద్ధికి బీసీసీఐ ఎల్లప్పుడూ సంపూర్ణ మద్దతు ఇస్తుందని బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ తెలిపారు. నాణ్యమైన ప్రత్యర్థి జట్లతో ద్వైపాక్షిక మ్యాచ్‌లు ఆడటం వల్ల అఫ్గాన్ ఆటగాళ్లకు అంతర్జాతీయ స్థాయిలో విలువైన అనుభవం లభిస్తుందని పేర్కొన్నారు. భారత అభిమానుల్లో అఫ్గాన్ ఆటగాళ్లకు ఉన్న ఆదరణ ఇరు దేశాల క్రికెట్ అనుబంధాన్ని మరింత బలోపేతం చేసిందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పేర్కొన్నారు. 2018లో అఫ్గాన్ తొలి చారిత్రక టెస్టుకు ఆతిథ్యమిచ్చిన భారత్, ఇటీవలే జూన్‌లో టెస్ట్, వన్డే సిరీస్‌లను నిర్వహించిన సంగతిని ఆయన గుర్తుచేశారు. ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రోహన్ జైట్లీ ఈ సిరీస్ పట్ల హర్షం వ్యక్తం చేశారు. అరుణ్ జైట్లీ స్టేడియంలో ఇరు జట్లకు అత్యుత్తమ వసతులు కల్పిస్తామని, ఢిల్లీ క్రికెట్ అభిమానులకు ఈ మూడు టీ20 మ్యాచ్‌లు సరికొత్త వినోదాన్ని అందిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సిరీస్ అఫ్ఘానిస్థాన్ క్రికెట్‌కు ఎంతో కీలకమని ఏసీబీ చైర్మన్ మిర్వైస్ అష్రఫ్ పేర్కొన్నారు. బీసీసీఐతో ఉన్న దీర్ఘకాలిక సంబంధాల్లో ఇది మరో కీలక ముందడుగు అని, భారత్ వేదికగా ఈ సిరీస్ నిర్వహించడం ద్వారా వాణిజ్య, సాంకేతిక, క్రీడా రంగాల్లో తమకు ఎంతో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కాగా బీసీసీఐ, ఏసీబీ ప్రకటనతో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు షాక్ తగిలినట్లయింది. ఎందుకంటే ఆ దేశ క్రికెట్ బోర్డు.. తమతో సిరీస్ ఆడేందుకు భారత్.. బంగ్లాదేశ్ వస్తుందని ఆశలు పెట్టుకుంది. కానీ తాజా షెడ్యూల్ ప్రకటన చూస్తే.. బంగ్లాదేశ్ పర్యటనకు తాము వెళ్లడం లేదని బీసీసీఐ చెప్పేసినట్లయింది.

## కుల్‌దీప్‌కు తుది జట్టులో స్థిరత్వం కల్పించాలి

**టీమిండియా మాజీ స్పిన్నర్ మురళీ కార్తీక్ సూచన**

భారత స్టార్ చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను టీమ్ మేనేజ్ మెంట్ సరిగ్గా ఉపయోగించు కోవట్లేదనే ఆందోళన మాజీ క్రికెటర్లలో తీవ్రమవుతోంది. 15 మందిలో ఉంటున్నప్పటికీ అతడికి తుది జట్టులో మాత్రం ఆడే అవకాశం రావట్లేదు. ఇటీవల ఇంగ్లాండ్‌తో ముగిసిన మూడు వన్డేల సిరీస్‌లోనూ అతడు బెంచ్‌కే పరిమితమ య్యాడు. ఈ నేపథ్యంలో శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు ముందు కుల్‌దీప్‌ను ఉద్దేశించి.. టీమిండియా మాజీ స్పిన్నర్ మురళీ కార్తిక్ కీలక వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ శర్మ, ద్రవిడ్ హయాంలో కుల్‌దీప్‌ను ఒక అసలైన మ్యాచ్ విన్నర్‌గా చూస్తూ పూర్తి స్వేచ్ఛ, భరోసా ఇచ్చారని గుర్తు చేశాడు. ప్రస్తుత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సైతం అదే బాటలో ఈ స్పిన్నర్ విషయంలో అలాంటి నిర్ణయాలే తీసుకోవాలని హితవు పలికాడు. కాగా రాహుల్ ద్రవిడ్ కోచింగ్ హయాంలో (2021 నవంబర్ నుంచి 2024 జూన్ వరకు) కుల్‌దీప్ అన్ని ఫార్మాట్లలో కలిపి నెలకు సగటున 2 మ్యాచ్‌ల చొప్పున 60 మ్యాచ్‌లు ఆడాడు. అయితే గంభీర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ సగటు నెలకు 1.5 మ్యాచ్‌లకు (38 మ్యాచ్‌లు) పడిపోయింది. ముఖ్యంగా ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో కుల్‌దీప్‌ను కాదని నలుగురు పేసర్లతో బరిలోకి దిగడం అతని ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా మారిందని విశ్లేషకులు భావిస్తున్నారు. కుల్‌దీప్ పట్ల ప్రస్తుత మేనేజ్‌మెంట్ వ్యవహరిస్తున్న తీరుపై సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా తన యూట్యూబ్ ఛానెల్‌లో బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. గంభీర్ హయాంలో బౌలింగ్ పదును కంటే బ్యాటింగ్ డెప్త్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంపై మురళీ కార్తీక్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. టెస్టు మ్యాచ్ గెలవాలంటే ప్రత్యర్థి 20 వికెట్లు తీయడం అత్యంత కీలకమని వ్యాఖ్యానించాడు. కేవలం బ్యాటింగ్ డెప్త్ కోసం బౌలింగ్‌ను బలహీనపర్చకూడదని పేర్కొన్నాడు. కుల్‌దీప్ బ్యాట్‌తో ఏమీ అసమర్థుడు కాదని, నైట్‌వాచ్‌మన్‌గా ఎన్నో సార్లు ఎక్కువ సేపు క్రీజులో నిలబడిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశాడు. జడేజా, అశ్విన్ వలె భారీ హిట్టింగ్ చేయలేకపోయినా, ఒక ప్రామాణిక స్పిన్ బౌలర్‌గా ప్రపంచంలో ఎక్కడైనా వికెట్లు తీయగల సత్తా కుల్‌దీప్‌కు ఉందని కొనియాడాడు. తుది జట్టులో తన స్థానం ఖాయమనే భరోసా కల్పించినపుడే ఆటగాళ్లు అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తారని ఈ సందర్భంగా మురళీ కార్తిక్ చెప్పుకొచ్చాడు.

# ఇక సినిమాల్లో అవకాశాలు రావనుకున్నా..నటి సమంత



నటి సమంత 'మా ఇంటి బంగారం'తో విజయాన్ని సొంతం చేసుకున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. యాక్షన్ సినిమాల్లో నటించడం అంత సులభమైన విషయం కాదన్నారు. సొంతంగా సినిమాలు నిర్మించడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిర్మాణ రంగం తనకిచ్చిన సృజనాత్మక స్వేచ్ఛ.. నటన ఇవ్వలేదని తెలిపారు. మయోసైటిస్ వచ్చిందని తెలిసినప్పుడు ఓ ఆలోచన నన్ను కలవరపెట్టింది. ఇక సినిమాలోకి తీసుకోవడానికి నిర్మాతలు ఆలోచిస్తారేమోనని భయపడ్డాను. కానీ, ఇప్పుడు నేనే నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసి సినిమాలు నిర్మిస్తున్నాను. వరుస ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాను. చిత్ర పరిశ్రమలో కొనసాగుతూనే కెమెరా ముందు కాకుండా వెనక కూడా నాకు నచ్చిన పనులు చేస్తున్నాను' అని అన్నారు. యాక్షన్ పాత్రల గురించి సమంత మాట్లాడుతూ, 'ది ఫ్యామిలీ మ్యాన్, సిటాడెల్: హనీ బన్నీ సిరీస్‌లలో నేను చేసిన యాక్షన్ సీన్లకు మంచి స్పందన రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది. అమ్మాయిలు యాక్షన్ సన్నివేశాలు చేస్తే ప్రేక్షకులు అంత సులభంగా అంగీకరించరు. ఆ ధోరణిని తీసివేయాలనుకుంటున్నా. హీరోయిన్స్ కూడా అన్ని చేయగలరని నిరూపించాలని అనుకుంటున్నా. సినిమాలో దెబ్బలు తింటూ, ఫైట్స్ చేయడం నాకెంతో ఉత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు.

## అసభ్యకరమైన పోస్టులు తొలగించండి

**జాన్వీ కపూర్ పిటిషన్‌పై కోర్టు ఆదేశం**



ప్రముఖ బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ తన వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన పేరు, ఫొటోలు, వీడియోలను అడ్డుపెట్టుకుని సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు, ఏఐ ద్వారా సృష్టించిన డీప్‌ఫేక్ వీడియోలను ప్రచారం చేస్తున్నారని ఆమె తరఫు న్యాయవాది కోర్టులో వాదించారు. అయితే ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనూప్ జైరామ్ భంభాని కీలక ఆదేశాలు జారీ చేశారు. అసభ్యకరంగా ఉన్న కంటెంట్‌ను, అలాగే ఎవరైనా ఆమె పేరును వాణిజ్యపరంగా దుర్వినియోగం చేస్తుంటే ఆ పోస్టులను తక్షణమే తొలగించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. పర్సనాలిటీ రైట్స్ అనే భావనకు ఒక సరైన హద్దు ఉండాలని, సెలబ్రిటీల హక్కులను రక్షించడంతోపాటు భావప్రకటన స్వేచ్ఛను కూడా సమతుల్యం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అన్ని ఫ్యాన్ పేజీలపై ఒకేసారి నిషేధం విధించలేమని కోర్టు పేర్కొంది. కేవలం వాణిజ్య ప్రయోజనాల కోసం లేదా డబ్బు సంపాదనే లక్ష్యంగా ఎవరైనా ఆమె పేరును వాడుకుంటేనే కచ్చితంగా చర్యలు తీసుకోవచ్చునని, అయితే అన్ని ఫ్యాన్ పేజీలను నేరపూరితమైనవిగా పరిగణించలేమని తెలిపారు. కొందరు వ్యంగ్యంగా లేదా విమర్శనాత్మక ధోరణిలో కూడా పోస్టులు చేసే అవకాశం ఉందని న్యాయమూర్తి గుర్తుచేశారు. ఈ కేసులో మెటా తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ తరఫున ఇప్పటికే 4,000కు పైగా యూఆర్ఎల్‌లను సమర్పించారని, అయితే ఆ కంటెంట్ అంతా ఒకేలా అభ్యంతరకరంగా లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో, ఆరోపణలు ఎదుర్కొంటున్న కంటెంట్‌ను స్పష్టమైన వర్గాలుగా విభజించి తదుపరి విచారణకు కోర్టు ముందుంచాలని పిటిషనర్ తరఫు న్యాయవాదిని న్యాయమూర్తి ఆదేశించారు. గతంలో కూడా పలువురు ప్రముఖ నటీనటులు, క్రీడాకారులు, రాజకీయ నాయకులు తమ వ్యక్తిత్వ హక్కుల రక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609